**WANTED**

అనతి కాలంలోనే అశేష ప్రజాదరణ పొందిన తెలంగాణ చౌరస్తా డిజిటల్ దినపత్రికకి సూర్యాపేట, హైదరబాద్ జిల్లాలల్లో నియోజకవర్గాల వారిగా రిపోర్టర్స్ కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రియార్టీ ఉంటుంది

సంప్రదించాల్సిన నెంబర్లు:

8328571871, 8897273714

తెలంగాణ చౌరస్తా

Voice Of Democracy

epaper.tcnewsdaily.com
www.tcnewsdaily.com

సంపుటి: 01 సంచిక:168

24 క్యారెట్లు 125,457.00 | కిలో వెండి 1,48,547.00 | tcnewsdaily | 13.01.2026 మంగళవారం, హైదరాబాద్

## బ్యాంక్ అకౌంట్ నుంచి
# చలాన్ల డబ్బులు కట్



- ఆ మేరకు బ్యాంకులతో అనుసంధానం కండి
- చలాన్లపై డిస్కౌంట్లు వద్దు
- ట్రాఫిక్ నియంత్రణను ప్రభుత్వం మొదటిప్రాధాన్యత అంశం
- మార్పులకు అనుగుణంగా పోలీస్ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది
- నిబంధనలు పాటించకపోవడం వల్లే రోడ్డు ప్రమాదాలు
- విద్యార్థి దశలోనే అవగాహన కల్పించాలి
- ప్రతి మూడు నిమిషాలకు ఓ నిండు ప్రాణం బలి
- రవాణా శాఖ బలోపేతానికి ‘ కమిటీ’
- సైబర్ క్రైంపై రాష్ట్ర పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించాలి
- అరైవ్ అలైవ్’ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

రోడ్డు ప్రమాదాలను రాష్ట్ర ప్రభుత్వం తీవ్రమైన సమస్యగా పరిగణిస్తోందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ ప్రమాదాలను తగ్గించేందుకు ట్రాఫిక్ నిబంధనలను కఠినతరం చేయాలని అధికారులను ఆదేశించారు. చలాన్లకు ముందే నిబంధనలు అమలు చేయాలని తెలిపారు. నిబంధనలు పాటించకపోవడం వల్లే రోడ్డు ప్రమాదాలు జరిగి, ప్రాణ నష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రూల్స్ బ్రేక్ చేసిన వాహనదారులపై చలాన్లు వేయడం, మళ్లీ డిస్కౌంట్ ఇవ్వడమేంటని ప్రశ్నించారు. చలాన్లపై డిస్కౌంట్లు వద్దు...వాహనదారుడి బ్యాంక్ అకౌంట్ నుంచి నేరుగా చలాన్ల డబ్బులు కట్ అయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ విషయంలో బ్యాంకులతో అనుసంధానం కావాలని

।మిగతా 2 లో।

# జిల్లాల పునర్విభజనకు కమిటీ
## అన్ని వర్గాల అభిప్రాయాలు తీసుకుంటాం

- రిటైర్డ్ జడ్జితో కమిషన్ ఏర్పాటు.. ఆరునెలల్లో నివేదిక కోరుతాం
- గెజిటెడ్ ఆఫీసర్ల అసోసియేషన్- 2026 డైరీ ఆవిష్కరణ
- ఉద్యోగులే ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారు
- ప్రభుత్వ ఉద్యోగులకు కొత్త జిల్లా కేంద్రాల్లో ఇండ్ల స్థలాలు ఇస్తాం
- వచ్చే బడ్జెట్ సమావేశాల్లో చర్చించి విధివిధానాలు
- ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి రూ. కోటి బీమా చేస్తాం
- నేను ఒక్క రోజూ సెలవు తీసుకోలేదు
- గత ప్రభుత్వం 8లక్షల కోట్ల అప్పుల భారాన్ని మాపై మోపింది
- సీఎం రేవంత్‌రెడ్డి



> జిల్లాల సరిహద్దులు మార్చాలని విజ్ఞప్తులు వస్తున్నాయనీ, వాటి పునర్విభజన కోసం త్వరలో రిటైర్డ్ జడ్జీ నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేయనున్నట్టు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ల సెంట్రల్ అసోసియేషన్ 2026 డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ కమిటీ రాష్ట్రమంతా తిరిగి అన్ని వర్గాల నుంచి అభిప్రాయాలు స్వీకరిస్తుందని చెప్పారు.

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

రాచకొండ కమిషనరేట్ పేరు సహేతుకంగా లేదనే మార్చినట్టు చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులకు కొత్త జిల్లా కేంద్రాల్లో ఇండ్ల స్థలాలు ఇస్తామని సీఎం ప్రకటించారు. వచ్చే బడ్జెట్ సమావేశాల్లో అన్నీ రాజకీయ పార్టీలతో చర్చించి విధివిధానాలు ఖరారు చేస్తామని వివరించారు. ప్రభుత్వంలో ఉన్న 200 మంది రాష్ట్రాన్ని నడపలేరనీ, 10.50 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులే రాష్ట్రాన్ని నడిపిస్తున్నారని సీఎం అన్నారు. మనమంతా ఒకే కుటుంబమనీ, వేర్వేరు కాదని వ్యాఖ్యానించారు. తాను ఇప్పటివరకు ఒక్కరోజు కూడా సెలవు తీసుకోలేదని చెప్పారు. ఉద్యోగులే మా ప్రభుత్వ సారధులు, వారధులని అభిప్రాయపడ్డారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి రూ. కోటి బీమా ఇవ్వాలని నిర్ణయించామని, ఇందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలు రూ. 12 వేల కోట్ల మేర పెండింగ్‌లో ఉన్నాయనీ, పన్ను వసూళ్లలో అవకతవకలు అరికడితే రావాల్సిన నిధులు వస్తాయని, పన్నులు

।మిగతా 2 లో।

## ఉగ్రవాద నెట్ వర్క్ విచ్ఛిన్నం చేయాలి

- అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా చర్యలు
- ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి అంతర్జాతీయంగా ప్రయత్నాలు జరగాలి
- ఉగ్రవాదాన్ని నిర్మూలించేందుకు రెండు దేశాలు కట్టుబడి ఉన్నాయి
- పహల్గామ్, ఢిల్లీ టెర్రర్ ఎటాక్లను ఖండించిన భారత్ జర్మనీ
- భారత్ పర్యటనలో జర్మన్ ఛాన్సలర్ ఫ్రెడ్రిక్ మెర్జ్
- ప్రధాని నరేంద్ర మోదీతో కీలక చర్చలు
- అనంతరం సంయుక్త ప్రకటన విడుదల

2లో

## పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు
# జాతీయహోదా సాధ్యం కాదు

- పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా
- రాష్ట్ర విభజన చట్టం ప్రకారం దక్కింది
- పేదలకు మరింత మేలుచేసేందుకే ఉపాధి హామీ పథకంలో మార్పులు
- టెక్నాలజీని జోడించడం ద్వారా జవాబుదారీతనాన్ని పెంచాం
- నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే నగదు జమ
- సంస్కరణలు అనేవి నిరంతర ప్రక్రియ
- నూతన చట్టం ద్వారా కూలీలకు పక్కాగా హక్కులు
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్)' VBG RAM G యాక్ట్2025 పై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. బీజేపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు.ఈ చట్టం కేవలం గుంతలు తవ్వే పథకం కాదని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తూ ప్రతి కుటుంబానికి అదనపు ఆదాయం కల్పించేలా రూపొందించబడిందని ఆయన స్పష్టం చేశారు. ఈ పథకంలో టెక్నాలజీని జోడించడం ద్వారా జవాబుదారీతనాన్ని పెంచామని, గతంలో ఉన్న అవినీతిని అరికట్టేందుకు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే నగదు జమ చేసేలా డిజిటల్ విధానాన్ని పటిష్టం చేశామని తెలిపారు. సంస్కరణలు అనేవి నిరంతర ప్రక్రియ అని, గత అనుభవాల దృష్ట్యా

।మిగతా 2 లో।



# సంక్రాంతి ఇక్కట్లు

- పండక్కి పల్లెబాట పట్టిన పట్నం వాసులు
- ఏమాత్రం సరిపోని రైళ్లు, బస్సులు
- రహదారులు, ప్రయాణ ప్రాంగణాలు రద్దీ
- టోల్ ప్లాజాల వద్ద కిలోమీటర్ల కొద్దీ వాహనాలు
- ఇష్టారాజ్యంగా టికెట్ ధరలు
- అసంతృప్తిలో ప్రయాణికులు
- పండుగ సందర్భంగా 12 లక్షలమంది సొంతూళ్లకు

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రజలంతా స్వస్థలాల బాట పట్టారు. కుటుంబ సమేతంగా ఊళ్లకు ప్రయాణమవుతున్నారు. ఆర్టీసీ, ప్రయివేట్ బస్సులు, రైళ్లు, సొంత వాహనాల్లో పల్లెలకు చేరుకుంటున్నారు. దీంతో రహదారులు, ప్రయాణ ప్రాంగణాలు రద్దీగా మారుతున్నాయి. అయితే ఈ రద్దీకి తగ్గటుగా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయలేదని ప్రయాణికులు కొంత అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.సంక్రాంతికి ఊళ్లకు వెళ్తున్న ప్రయాణికుల సౌకర్యార్థం ప్రభుత్వం

।మిగతా 2 లో।




## కాంగ్రెస్ పాలనలో
# ఆగిన పల్లె ప్రగతి

- జిల్లాలు రద్దు చేస్తే అగ్గి పుట్టిస్తాం
- కేసీఆర్ పాలనలో మైగ్రేషన్ నుంచి ఇరిగేషన్‌గా మార్చాం
- మున్సిపల్ ఎన్నికల నుంచే బీఆర్ఎస్ జైత్రయాత్ర
- నారాయణపేట, మహబూబ్‌నగర్ బీఆర్ఎస్ సర్పంచులకు సన్మానం
- బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2లో

# పీఎస్ఎల్‌వీ సీ62 విఫలం



- కొత్త ఏడాదిలో ఇస్రో తొలి ప్రయోగం ఫెయిల్
- మూడో దశలో అంతరాయం
- కక్ష్యలోకి చేరని 16 శాటిలైట్లు
- పీఎస్ఎల్‌వీ ఫెయిల్ కావడం వరుసగా ఇది రెండోసారి
- విఫల కారణానికి సునిశిత విశ్లేషణ ప్రారంభం
- ఇస్రో చైర్మన్ వీ నారాయణన్
- పీఎస్ఎల్‌వీ ప్రయోగాలకు రూ.250-300 కోట్లు ఖర్చు

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) కొత్త ఏడాదిలో చేపట్టిన తొలి ప్రయోగం విఫలమైంది. సోమవారం ప్రయోగించిన పీఎస్ఎల్‌వీసీ62 రాకెట్ నిర్దేశిత కక్ష్యను చేరుకోలేకపోయింది. ఓ విదేశీ ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్ సహా 16 శాటిలైట్లను ఇది మోసుకెళ్లింది. ఇస్రో చైర్మన్ వీ నారాయణన్ మాట్లాడుతూ, ఈ రాకెట్‌ను నిర్దేశిత ఎత్తుకు నెట్టడానికి మూడో దశలో స్ట్రాప్‌ఆన్ మోటార్స్ బలాన్ని అందిస్తున్నపుడు దీని ప్రయాణం దారి తప్పినట్లు, రాకెట్‌లో అంతరాయాలు ఏర్పడినట్లు గుర్తించామన్నారు. దీనికి కారణాన్ని తెలుసుకోవడానికి సునిశిత విశ్లేషణ ప్రారంభమైందని చెప్పారు. నిర్దేశిత కక్ష్యలోకి ఉపగ్రహాలను ప్రవేశపెట్టడం

।మిగతా 2 లో।

# సుప్రీంలో బలహీన రిట్

- సంక్రాంతి వేళ చంద్రబాబుకు రేవంత్ ఇచ్చిన గిఫ్ట్
- పోలవరం-నల్లమలసాగర్‌కు రేవంత్ రెడ్డి పూర్తిస్థాయిలో సహకారం
- పంచాయితీలు, కోర్టులు వద్దు
- చర్చించుకుందామన్న రేవంత్ మాటల ఆంతర్యమేంటని ప్రశ్న
- సుప్రీంకోర్టు సాక్షిగా రేవంత్ ద్రోహబుద్ధి బట్టబయలు
- తెలంగాణ నీటి హక్కుల కోసం పోరాడుతాం- మాజీ మంత్రి హరీష్ రావు

2లో



# జిల్లాల పునర్విభజనకు కమిటీ

తరువాయి భాగం

పెంచాల్సిన అవసరం లేదని, సరిగ్గా వసూళ్లు చేస్తే చాలని అభిప్రా యపడ్డారు. సంఘాల నాయకులు ప్రభుత్వంతో కుమ్మక్క య్యారని అనుకుంటున్నారని చెబుతున్నారని వివరించారు. మనమంతా ఒకే కుటుంబమనీ, కుటుంబంలో కుమ్మక్కులు ఏముంటాయని అన్నారు. ఉమ్మడి కుటుంబంలో కలిసుంటే చూడలేనివారు, కడుపులో విషం పెట్టుకునే వారు ఎప్పుడూ ఉంటారని తెలిపారు. ఒక శుక్రాచార్యుడు ఫామ్‌హౌస్‌లో ఉండి అసెంబ్లీకి మారీచుడు లాంటి వాళ్లను పంపిస్తున్నారని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వం 8లక్షల కోట్ల అప్పుల భారాన్ని మాపై మోపిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం రూ.18 వేల కోట్లనీ, కానీ ప్రతినెలా రూ.22 వేల కోట్లు అప్పులకు చెల్లించాల్సి వస్తున్నదని వివరించారు. సగటు మధ్యతరగతి వ్యక్తి గౌరవంగా కుటుంబాన్ని ఎలా ముందుకు తీసుకెళ్తున్నారో ప్రభుత్వానిది కూడా అదే పరిస్థితి అని అభిప్రాయపడ్డారు. ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్ల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. గెజిటెడ్ ఆఫీసర్ల కోసం కార్యాలయం నిర్మాణానికి సహకరిస్తామన్నారు. ప్రజలకు మంచి పరిపాలన అందిద్దామనీ, మీ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఎప్పుడూ సహకరిస్తుందని తెలిపారు.

# సంక్రాంతి ఇక్కట్లు

తరువాయి భాగం

ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఆర్టీసీ 6,430 ప్రత్యేక బస్సులను, దక్షిణ మధ్య రైల్వే 160 ప్రత్యేక రైళ్లను నడిపిస్తోంది. హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు దాదాపు వెయ్యికిపైగా ప్రయివేట్ బస్సులను నడిపిస్తున్నారు. వీటిలో పాటు క్యాబ్‌లకు కూడా భారీగా డిమాండ్ ఏర్పడింది. చాలామంది ప్రజలు తమ సొంత వాహనాల్లో సొంతూళ్లకు వెళ్తున్నారు.

టోల్ ప్లాజాల వద్ద కిలోమీటర్ల కొద్దీ వాహనాలు గంటల తరబడి నిలిచిపోతున్నాయి. ఆర్టీసీ బస్సులకు టోల్ ప్లాజాల వద్ద ప్రత్యేక లైన్లను కేటాయించడంతో అవి సులభంగా వెళ్తున్నాయి. టోల్ ప్లాజా వద్ద వాహనాలు బారులు తీరినప్పుడు సిబ్బంది వాహనాల వద్దకు వచ్చి ఫాస్టాగ్‌ను స్కాన్ చేసేలా ఏర్పాట్లు చేశారు. ప్రధాన బస్ స్టేషన్లు ఎంజీబీఎస్, జేబీఎస్‌తో పాటు ప్రధాన పాయింట్లు కూడా ప్రయాణికులతో రద్దీగా ఉంటున్నాయి. సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి, చర్లపల్లి రైల్వే స్టేషన్‌లు కిటకిటలాడుతున్నాయి.

ఆర్టీసీ బస్సులు సరిపోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పండుగ సెలవుల్లో విశాఖ, విజయవాడ, రాజమండ్రి, శ్రీకాకుళం, బెంగళూరు, తిరుపతి, విశాఖపట్నం, గుంటూరు తదితర ప్రాంతాలకు వెళ్లేవారు ప్రయి వేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. తెలంగాణలోనూ మేడా రం, ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. సెలవులు రావటంతో..ఇదే అదనుగా సొమ్ము చేసుకోవడానికి ప్రయివేట్ ట్రావెల్స్ యజమానులు టికెట్ ధరలను పెంచేశారు. ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని అధిక చార్జీలను వసూలు చేస్తున్నారని ప్రయాణికులు మండిపడుతున్నారు. రద్దీకి తగ్గట్లుగా ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో ప్రయివేట్ ట్రావెల్స్ యాజమాన్యాలు ఇష్టారాజ్యం చెలాయిస్తున్నారని పలువురు ప్రయాణికులు ఆరోపించారు. సాధారణ రోజుల్లో హైదరాబాద్‌విజయనగరానికి ప్రయివేట్ ట్రావెల్స్ బస్సుల్లో సీటర్ అయితే రూ.1,400 నుంచి రూ.1,600 చార్జీ, స్లీపర్ అయితే రూ.2 వేల వరకు చార్జీ ఉంటుంది. ప్రస్తుతం సంక్రాంతి సెలవుల నేపథ్యంలో ఓ ట్రావెల్స్ సంస్థ ఏకంగా నాలుగు రెట్లు ధరలు పెంచేసింది. హైదరాబాద్ నుంచి విజయనగరానికి రూ.6,000 వసూలు చేస్తోంది. మరో సంస్థ సీటర్‌కు రూ.3,499, స్లీపర్ అయితే రూ.3,999 తీసుకుంటోంది.

గతేడాది సంక్రాంతి పండుగ సందర్భంగా 9 లక్షల మంది ప్రజలు సొంతూళ్లకు బయలుదేరి వెళ్ళారు. ఈ ఏడాది ఆ సంఖ్య 12 లక్షలకు చేరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. సాధారణంగా హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు రోజుకు 10 వేల నుంచి 12 వేల వాహనాలు నిత్యం తిరుగుతుంటాయి.

**జాతీయ రహదారిపై బారులు తీరిన వాహనాలు**

సంక్రాంతి పండగకు హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లే జాతీయ రహదారిపై వాహనాలు ఒకదాని వెనుక ఒకటి బారులు తీరతాయి. రద్దీ పెరగడంతో వాహనాలు ట్రాఫిక్‌లో వేగంగా వెళ్లలేక, బంపర్ టు బంపర్ వెళుతున్నాయి. రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ నుంచి యాదాద్రి జిల్లా పంతంగి టోల్‌ప్లాజా దాటే వరకు ఇదే పరిస్థితి నెలకొంది. ఈ మార్గంలో అక్కడక్కడ ప్రధాన కూడళ్లలో, బస్టాప్‌లలో పెరిగిన వాహనాల రద్దీతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. ప్రతి ఏటా సంక్రాంతి పండక్కి వాహనదారులకు ఈ తిప్పలు తప్పడం లేదు

# కాంగ్రెస్ పాలనలో ఆగిన పల్లె ప్రగతి

తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో ;



కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో పల్లెల్లో ఉన్న ట్యాంకర్ల ఇంజిన్‌లో డీజిల్ లేదు.. ట్యాంకర్‌లో నీళ్లు లేవు.. పల్లె ప్రగతి ఆగింది.. అని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లాల సర్పంచులకు సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎంబీసీ మైదానంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ ప్రసంగిస్తూ.. రాష్ట్రంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పల్లెలు అభివృద్ధిలో పట్టణాలతో పోటీపడే వాతావరణం ఉండేదని అన్నారు. పార్కులు, శ్మశాన వాటికలు, మొక్కల పెంపకం, గ్రామసభలు, క్రీడా మైదానాలు ఇలా అనేక కార్యక్రమాలతో ప్రగతిని పరిగెత్తించిన రోజులు ఇప్పుడు కనిపించడం లేదన్నారు. కళ్యాణలక్ష్మి మొదలుకొని రైతుబంధు వరకు ఏ ఒక్క పథకం కాంగ్రెస్ పాలనలో అమలు కావడం లేదని ఆరోపించారు. రెండేండ్ల పాలనలో ఏ ఒక్క పనీ మొదలు పెట్టలేదన్నారు.

కొత్త పనులు చేయలేక అసమర్ధ ముఖ్యమంత్రిగా పేరు తెచ్చుకొని.. బూతు మాటలతో ప్రతిపక్ష పార్టీల నాయకులను బెదిరించడమే పనిగా పెట్టుకున్న సీఎం రేవంత్ రెడ్డిని ప్రజలు ఎక్కడికక్కడ నిలదీయాలని అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలలో 40 శాతం సర్పంచులను గెలుచుకున్న గులాబీ దళం.. రాబోయే మున్సిపల్ ఎన్నికలు మొదలుకొని ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో జైతయాత్రను కొనసాగించాలని పిలుపునిచ్చారు. పాలమురురంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు బీఆర్ఎస్ పాలనలో 90 శాతం పూర్తి చేస్తే.. మిగిలిన 10 శాతం పనులు కూడా పూర్తి చేయకుండా నీళ్లు ఇవ్వలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వ పాలన ఉందని విమర్శించారు. కేసీఆర్ పాలనలో పాలమూరు జిల్లాను మైగ్రేషన్ నుంచి ఇరిగేషన్‌గా మార్చామని చెప్పారు. 17న ముఖ్యమంత్రి ఈ జిల్లాకు వచ్చే ముందు.. ఐటీ పార్కులో 13 పరిశ్రమలు ఎందుకు వెళ్లిపోయాయో, కొత్తగా ఒక్క పరిశ్రమను కూడా ఎందుకు తేలేదో ప్రజలకు సమాధానం చెప్పి రావాలని సవాల్ విసిరారు. జిల్లాలను రద్దు చేస్తే అగ్గి పుట్టిస్తామని హెచ్చరించారు. ఈ సభలో మాజీ ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, అలంపూర్ విధేయుడు, వివిధ అనుబంధ సంఘాల కార్పొరేషన్ల మాజీ అధ్యక్షులు పాల్గొన్నారు

# బ్యాంక్ అకౌంట్ నుంచి చలాన్ల డబ్బులు కట్

తరువాయి భాగం




పోలీస్‌శాఖను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ యూసుఫ్ గూడలోని కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో రాష్ట్ర పోలీస్ శాఖ నిర్వహించిన 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. రవాణా శాఖలో పని చేస్తున్న ఉద్యోగుల్లో కొంత మంది ఈ ఉద్యోగాన్ని డిమోషన్‌లా భావిస్తున్నారని అన్నారు.

డీజీస్థాయి లేదా అదనపు డీజీస్థాయి అధికారి పర్యవేక్షణలో రవాణా వ్యవస్థను బలోపేతం చేస్తామని తెలిపారు. సమాజంలో నేరాల విషయంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా పోలీస్ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మన దేశంలో ప్రతి నిమిషం ఒక రోడ్డు ప్రమాదం జరుగుతోందని, ప్రతి మూడు నిమిషాలకు ఓ నిండు ప్రాణం బలవుతోందని సీఎం రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. యుద్ధంలో సైనికుల కంటే ఎక్కువగా రోడ్డు ప్రమాదాల్లోనే చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ట్రాఫిక్ నియంత్రణను రాష్ట్ర ప్రభుత్వం మొదటి ప్రాధాన్యతా అంశంగా తీసుకుంటోందని తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో ఎంతో మంది ప్రముఖులు కూడా తమ బిడ్డలను కోల్పోయి దుఃఖంలో మునిగిపోతున్నారని గుర్తు చేశారు. రోడ్డు సేఫ్టీపై విద్యార్థి దశలోనే అవగాహన కల్పించాల్సిన అవసరముందని చెప్పారు. మైనర్లు వాహనంతో రోడ్డుపైకి రావడం వల్లే కొన్ని ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. వారికి వాహనాలను ఇవ్వకుండా తల్లిదండ్రులు పూర్తి బాధ్యత తీసుకోవాలని సూచించారు. మద్యం తాగి బండి నడిపితే కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు.

రాష్ట్ర వ్యాప్తంగా కబ్జాకు గురైన చెరువులను కాపాడుతున్నామని సీఎం గుర్తు చేశారు. చెరువుల విస్తీర్ణం తగ్గిపోవడంతో చిన్న వర్షాలకే సమీప నివాసాలు మునిగిపోతున్నాయని గుర్తు చేశారు. కబ్జాకు గురైన చెరువుల పరిరక్షణకు హైడ్రాను తీసుకొచ్చామని చెప్పారు. ఇప్పుడు సైబర్ క్రైం అనేది అతి పెద్ద నేరంగా మారిందని తెలిపారు. మన తేరుకునే లోపే బ్యాంకు ఖాతాలు ఖాళీ అవుతున్నాయని చెప్పారు. సైబర్ క్రైంను అరికట్టేందుకు స్పెషల్ ఫోకస్ పెట్టామని తెలిపారు. రాష్ట్రంలో డ్రగ్స్ అక్రమ రవాణాను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామని గుర్తు చేశారు. సమాజానికి డ్రగ్స్ అతిపెద్ద శత్రువు అని తెలిపారు. డ్రగ్స్ మహమ్మారి ప్రమాదాన్ని ముందుగానే గుర్తించి ఈగల్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసుకున్నామన్నారు. డ్రగ్స్, గంజాయి నియంత్రణలో ప్రపంచ వ్యాప్తంగా తెలంగాణ పోలీసులకు గుర్తింపు దక్కిందని సీఎం అభినందించారు. కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు రాజ్‌ఠాకూర్, నవీన్ యాదవ్, డీజీపీ శివధర్ రెడ్డి, ఇతర పోలీసున్నతాధికారులు హాజరయ్యారు.

## పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు
# జాతీయహోదా సాధ్యం కాదు

తరువాయి భాగం



పేదలకు మరింత మేలు చేసేందుకే ఈ మార్పులు తెచ్చామని పేర్కొన్నారు. ఈ నూతన చట్టం ద్వారా కూలీలకు పక్కాగా హక్కులు కల్పిస్తున్నామని కిషన్ రెడ్డి వెల్లడించారు. పని అడిగిన 15 రోజుల్లోగా పని కల్పించకపోతే నిరుద్యోగ భృతి చెల్లించాలని, అలాగే వేతనాలు ఆలస్యమైతే రోజుకు 5 శాతం చొప్పున జరిమానా విధించేలా కఠిన నిబంధనలు తెచ్చామని చెప్పారు. పథకం అమలులో రాష్ట్రాలకు పూర్తి స్వేచ్ఛను ఇస్తూ, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ పనుల సీజన్‌లో ఈ పథకాన్ని ఎప్పుడు అమలు చేయాలో నిర్ణయించుకునే అధికారాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకే అప్పగించామని స్పష్టం చేశారు. పథకం పర్యవేక్షణ కోసం అడ్మినిస్ట్రేషన్ నిధులను 9 శాతానికి పెంచి, జియోట్యాగింగ్ ద్వారా పనుల్లో పారదర్శకతను పెంచుతున్నట్లు వివరించారు. నిధుల కేటాయింపు విషయంలో ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని కిషన్ రెడ్డి కొట్టిపారేశారు. ఈ ఏడాది దేశవ్యాప్తంగా రూ. 17 వేల కోట్లు అదనంగా ఖర్చు చేస్తున్నామని, తెలంగాణ రాష్ట్రానికి కూడా గత ఏడాది కంటే సుమారు రూ. 340 కోట్లు అదనంగా నిధులు అందబోతున్నాయని గణాంకాలతో సహా వివరించారు. ఫెడరల్ స్ఫూర్తితో కేంద్రం-రాష్ట్రాలు భాగస్వాములుగా పనిచేస్తేనే సంక్షేమ పథకాలు ప్రజలకు చేరుతాయని, రాష్ట్రాల అధికారాలను కేంద్రం లాక్కుంటోందన్న విమర్శల్లో వాస్తవం లేదని హితవు పలికారు. పథకాల పేర్ల మార్పు ముఖ్యం కాదని, అవి పేదలకు నిజంగా ఉపయోగపడుతున్నాయా లేదా అన్నదే కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. రాజకీయ అంశాలపై స్పందిస్తూ.. తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని కిషన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. దేశంలో నరేంద్ర మోదీ నాయకత్వం సుస్థిరమని, వరుసగా మూడోసారి అధికారంలోకి రావడమే ఇందుకు నిదర్శనమని చెప్పారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా విషయంలో చట్టపరమైన పరిమితులు ఉన్నాయని, అయితే ఆ ప్రాజెక్టుకు కేంద్రం నుంచి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా రాష్ట్ర విభజన చట్టం ప్రకారం దక్కిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రాల అభివృద్ధికి కేంద్రం నిరంతరం కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు.

# పీఎస్ఎల్‌వీ సీ62 విఫలం

తరువాయి భాగం

సాధ్యం కాలేదని, మొత్తం 16 ఉపగ్రహాలు రోదసిలో పడిపోయాయని తెలిపారు. ఇదిలావుండగా, ఇస్రో వర్గాల కథనం ప్రకారం, పీఎస్ఎల్‌వీ మిషన్ మూడో దశలో విఫలమవడం వరుసగా ఇది రెండోసారి. నిరుడు మే నెలలో చేసిన ప్రయత్నం మోటార్ ప్రెజర్ సమస్య వల్ల విజయవంతం కాలేదు. ఇస్రో మాజీ శాస్త్రవేత్త ఒకరు మాట్లాడుతూ, సమాచారాన్ని సేకరించి, విశ్లేషించి, అర్థం చేసుకుని, అవసరమైన దిద్దుబాటు చర్యలు చేపట్టడానికి కొంత సమయం పడుతుందన్నారు. 22.5 గంటల కౌంట్‌డౌన్ ముగిసిన తర్వాత సోమవారం ఉదయం 10.18 గంటలకు ఈ రాకెట్‌ను ప్రయోగించారు.

ఇది దూసుకెళ్తుండగా దాని వివరాలను ప్రత్యక్ష ప్రసారంలో శాస్త్రవేత్తలు వెల్లడించారు. ప్రారంభ దశలు ప్రణాళికకు అనుగుణంగానే జరిగాయి. "థర్డ్ స్టేజ్ ఇగ్నైటెడ్" అనే ప్రకటన రావడంతో మిషన్ కంట్రోల్ సెంటర్‌లో బాధాకరమైన నిశ్శబ్దం తాండవించింది. ఈ మిషన్ ఖర్చు ఎంతన్నది ఇస్రో వెల్లడించలేదు. అయితే గత పీఎస్ఎల్‌వీ ప్రయోగాలకు రూ.250300 కోట్లు ఇస్రో ఖర్చు పెట్టినట్టు సమాచారం.

**16 శాటిలైట్లు కోల్పోయాం..**

పీఎస్ఎల్‌వీ సీ62 విఫలం కావడంతో 16 శాటిలైట్లను కోల్పోయాం. ఇందులో ప్రధానమైనది ఈవోఎస్ఎన్1 లేదా అన్వేష. ఇది ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్. దీనిని డీఆర్‌డీవో నిర్మించింది. దీనిని భూమి మీద నుంచి 511 కి.మీ. ఎత్తులో ప్రవేశపెట్టవలసి ఉంది. ఈవోఎస్ఎన్1 అనేది హైపర్‌స్పెక్ట్రల్ ఇమేజింగ్ శాటిలైట్. భూమిపైగల మట్టి, నీరు, లోహాలు, చెట్లు, కాంక్రీట్ నిర్మాణాలు వంటివాటిపైన పడే సూర్య కాంతి పరావర్తనాల ఆధారంగా వాటిని ఏ మెటీరియల్‌తో తయారు చేశారో గుర్తించడానికి దోహదపడుతుంది. ప్రజా అవసరాలు, వ్యూహాత్మక కార్యకలాపాలకు ఈ టెక్నాలజీ ఉపయోగపడుతుంది. దీనితోపాటు దేశవిదేశాలకు చెందిన మరో 15 ఉపగ్రహాలను కూడా పీఎస్ఎల్‌వీ సీ62 మోసుకెళ్లింది. వీటిలో అయుఐశాట్, సీజీయూశాట్, ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్ ఉన్నాయి. ఆయుఐశాట్ భారత దేశపు తొలి ఇన్‌ఆర్బిట్ ఫ్యూయలింగ్ శాటిలైట్. సీజీయూశాట్‌ను విద్యార్థులు అభివృద్ధి చేశారు. ఇది లో ఎర్త్ ఆర్బిట్ శాటిలైట్. దీనిని ఎమర్జెన్సీ కమ్యూనికేషన్స్, విపత్తు నిర్వహణ కోసం డిజైన్ చేశారు.

పీఎస్ఎల్‌వీకి వరుసగా రెండు వైఫల్యాలు.. అత్యంత విజయవంతమైన రాకెట్‌గా పీఎస్ఎల్‌వీకి పేరుంది. వరుసగా రెండు వైఫల్యాలు ఎదురుకావడం ఇస్రోను కలవరపరుస్తున్నది. 2025 మే 18న చేపట్టిన పీఎస్ఎల్‌వీ సీ 61, తాజాగా చేపట్టిన పీఎస్ఎల్‌వీ సీ62 మూడో దశలోనే విఫలమయ్యాయి. గత 33 ఏండ్లలో 64 సార్లు పీఎస్ఎల్‌వీని ప్రయోగించగా, వాటిలో తాజా వైఫల్యం సహా 4 ప్రధాన వైఫల్యాలు ఉన్నాయి. పీఎస్ఎల్‌వీ సీ61ను గత ఏడాది మేలో ప్రయోగించగా, మూడో దశలో విఫలమైంది. దీంతో రాకెట్, ఈఓఎస్09 రాడార్ ఇమేజింగ్ శాటిలైట్‌లను కోల్పోవలసి వచ్చింది.

# ఉగ్రవాద నెట్ వర్క్ విచ్ఛిన్నం చేయాలి

తెలంగాణ చౌరస్తా నేషనల్ బ్యూరో:

గతేడాది జరిగిన పహల్గామ్ ఉగ్రదాడి, ఢిల్లీ బాంబు పేలుడు ఘటనలను భారత ప్రధాని నరేంద్ర మోదీ, జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడ్రిక్ మెర్జ్ సంయుక్తంగా ఖండించారు. ఉగ్రవాద స్థావరాలు, వాటి మౌలిక సదుపాయాలను నిర్వీర్యం చేయడానికి అంతర్జాతీయ చట్టానికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రెండు రోజుల భారత పర్యటనలో ఉన్న జర్మన్ ఛాన్సలర్ ఫ్రెడ్రిక్ మెర్జ్తో సోమవారం ప్రధాని మోదీ కీలక చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఇరుదేశాలు సంయక్తంగా విడుదల చేసిన ప్రకటనలో ఈ మేరకు పేర్కొన్నాయి.

సీమాంతర ఉగ్రవాదం సహా అన్ని రూపాల్లోని హింసాత్మక తీవ్రవాదాన్ని ఇరుదేశాల నాయకులు తీవ్రంగా ఖండించారు. ఐక్యరాజ్య సమితి, అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా, సమగ్రంగా ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి అంతర్జాతీయంగా ప్రయత్నాలు జరగాలని పిలుపునిచ్చారు. అలాగే ఉగ్ర స్థావరాలను కూల్చివేయాలని, టెర్రరిస్ట్ నెట్‌వర్క్‌లను విచ్ఛిన్నం చేయాలని పేర్కొన్నారు. "2025 ఏప్రిల్ 22న జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్ర దాడిని, నవంబర్ 10న దిల్లీలో జరిగిన ఉగ్రవాద ఘటనను ఇరు దేశాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. ఉగ్ర చర్యలను, ఉగ్రవాదాన్ని నిర్మూలించేందుకు రెండు దేశాలు కట్టుబడి ఉన్నాయి. టెర్రరిజాన్ని ఎదుర్కోవడానికి అంతర్జాతీయ స్థాయిలో ప్రయత్నాలు జరగాలి" అని ఇరు దేశాలు విడుదల చేసిన ఉమ్మడి ప్రకటనలో పేర్కొన్నాయి. కాగా, గతేడాది ఏప్రిల్ 22న జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది మృతి చెందారు. ఇందులో ఒక విదేశీయుడు ఉన్నారు. దీనికి ప్రతీకారంగా భారత్ మే 09న ఆపరేషన్ సిందూర్ పేరుతో పాకిస్థాన్లోని ఉగ్రస్థావరాలపై ప్రతిదాడి చేసింది. ఈ ఆపరేషన్లో భారత త్రివిధ దళాలు అత్యంత కచ్చితత్వంతో పాక్లోని ఉగ్రస్థావరాలను ధ్వంసం చేశాయి. ఇక నవంబర్ 10న దిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన బాంబు పేలుడు ఘటనలో 15 మంది మరణించారు. ఈ రెండు దాడుల్లోనూ ఉగ్రకుట్ర ఉన్నట్లు పోలీసులు దర్యాప్తులో గుర్తించారు.

**జెన్‌జీలో క్రియేటివిటీ ఉంది**

ఈ చర్చల అనంతరం ప్రధాని మోదీ 'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ ' ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెన్జీ తరంపై మాట్లాడారు. మన జెన్‌జీ తరం సృజనాత్మకతతో నిండి ఉందని అన్నారు. వినూత్న ఆలోచనలు, లక్ష్యాలు, ఉత్సాహంతో దేశ నిర్మాణంలో ముందువరుసలో ఉందని పేర్కొన్నారు.

# సుప్రీంలో బలహీన రిట్

తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:

పోలవరంనల్లమలసాగర్‌కు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పూర్తి స్థాయిలో సహకారం ఉందని, రేవంత్ రెడ్డి నిజస్వరూపం, ద్రోహ బుద్ధి సుప్రీంకోర్టు సాక్షిగా బట్టబయలైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు విమర్శించారు. గతంలో పాలమూరు ప్రాజెక్టుపై రైతులతో ఏపీ రిట్ వేయించి స్టే తెచ్చుకుందని, కాంగ్రెస్ సర్కార్ విచారణార్హత లేని పిటిషన్ వేసి రాష్ట్రానికి అన్యాయం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ఎంపీ, న్యాయవాది అభిషేక్ సింఘ్వీకి విచారణార్హత తెలియదా? అని ప్రశ్నించారు.

మన నీటి హక్కులను ఏపీకి ధారాదత్తం చేస్తూ రేవంత్ రెడ్డి ద్రోహం చేస్తున్నారని హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రిట్ ఉపసంహరించుకుని సివిల్ సూట్ ఫైల్ చేస్తామని ప్రభుత్వం చెప్పిందని అన్నారు. 4 రాష్ట్రాల వాదనలు వినడమనేది ఏళ్లు గడిచినా ముగియని కథేనని అన్నారు. ఈలోగా ఏపీ ప్రభుత్వం ప్రాజెక్టు పనులు పూర్తి చేసుకుంటుందని, తెలంగాణ నీటి హక్కులను కాలరాస్తూ ఏపీ నీళ్లు తరలించుకుపోతుందని పేర్కొన్నారు.

సుప్రీంలో బలహీన రిట్ సంక్రాంతి వేళ చంద్రబాబుకు రేవంత్ ఇచ్చిన గిఫ్ట్ అని హరీశ్ రావు ఎద్దేవా చేశారు. పోలవరంనల్లమలసాగర్‌పై ముందు నుంచీ ఏపీకి రేవంత్ రెడ్డి సహకారం అందిస్తున్నారని ఆరోపించారు. టెండర్ చివరి తేదీ తర్వాత కోర్టుకు వెళ్లి నల్లమలసాగర్‌కు పరోక్షంగా అంగీకరించారని, పసలేని రిట్ వేసి పరిపూర్ణంగా నల్లమలసాగర్‌కు మద్దతిచ్చారని తెలిపారు. పంచాయితీలు, కోర్టులు వద్దు చర్చించుకుందామన్న రేవంత్ రెడ్డి మాటల ఆంతర్యమేంటని నిలదీశారు. తెలంగాణ నీటి హక్కులను గంపగుత్తగా ఏపీకి అప్పచెప్పడమేనా చర్చల లక్ష్యం అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి గురుదక్షిణ కోసం ద్రోహం చేస్తుంటే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని, రేవంత్ రెడ్డి దుర్మార్గాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగడతామని హెచ్చరించారు. తెలంగాణ నీటి హక్కుల కోసం పోరాడతామని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టులో పోలవరంనల్లమల సాగర్ ప్రాజెక్టుపై దాఖలు చేసిన రిట్ పిటిషన్ను తెలంగాణ ప్రభుత్వం ఉపసంహరించుకుంది. దీంతో పిటిషన్ డిస్పోజ్ ఆఫ్ చేసినట్లుగా ప్రధాన న్యాయమూర్తి ప్రకటించారు. అంతకు ముందు నల్లమల సాగర్ ప్రాజెక్టుపై సుప్రీంకోర్టులో విచారణ ప్రారంభం కాగా, తెలంగాణ తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. తెలంగాణ దాఖలు చేసిన రిట్ పిటిషన్ వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదని న్యాయస్థానం సూచించింది. సూట్ దాఖలు చేస్తే గోదావరి నది పరీవాహక రాష్ట్రాల అభిప్రాయాలు పరిగణనలోకి వస్తాయని ధర్మాసనం పేర్కొంది. ఇంకా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల వాదనలు కూడా వినాల్సి ఉందని ధర్మాసనం స్పష్టం చేసింది.

అనుమతులు లేకుండా పోలవరం నుంచి బనకచర్ల లేదా నల్లమల సాగర్‌కు లింక్ చేసేందుకు ఏపీ ప్రభుత్వం చేపడుతున్న విస్తరణ పనులను తక్షణమే నిలిపివేయాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వం కొద్ది రోజుల క్రితం సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. తక్షణమే ఈ పనులు ఆపేలా ఆదేశించాలని న్యాయస్థానాన్ని కోరింది. పోలవరం ప్రాజెక్టు విస్తరణ పనులు చేపట్టడం చట్టబద్ధం కాదని, తెలంగాణ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా ప్రీ ఫీజిబులిటీ రిపోర్టులను కేంద్ర ప్రభుత్వం పరిశీలించటం సమంజసం కాదని తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం తెలిపింది. ఈ అంశాల్లో కేంద్ర జల సంఘం, కేంద్ర జలశక్తిశాఖ, గోదావరి నదీ యాజమాన్య బోర్డు(జీఆర్ఎంబీ)లకు స్పష్టమైన ఆదేశాలివ్వాలని తెలంగాణ సుప్రీంకోర్టును కోరింది. కేంద్ర జలసంఘం మార్గదర్శకాలకు విరుద్ధంగా ఏపీ సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు తయారీకి సిద్ధపడుతోందని, వెంటనే ఈ చర్యలను ఆపాలని కోరింది.



# డ్రగ్స్ కు వ్యతిరేకంగా పోరాడుదాం

- పారాలీగల్ వాలంటరీ యం.కృష్ణ

**మద్దూర్,తెలంగాణ చౌరస్తా:**

నారాయణపేట జిల్లా,మద్దూర్ మండలం,పెద్రిపహాడ్ గ్రామంలో ఎస్.హెచ్.జి మహిళలకు,యువతకు మాదకద్రవ్యాల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.డ్రగ్స్ రహిత సమాజం,యువతకు డ్రగ్స్ వినియోగం పై అవగాహన సదస్సు ఏర్పాటు చేసి,మాదకద్రవ్యాలుమాయాజాలం నుండి విముక్తి వంటి శీర్షికతో, డ్రగ్స్(మాదకద్రవ్యాలు) వల్ల కలిగే హాని,వ్యసనం గురించి పారాలీగల్ వాలంటరీ యం.కృష్ణ వివరించారు. ఉదాహరణలుగా గంజాయి, కొకైన్,ఆల్కహాల్ గా చెప్తూ,విద్యార్థులు యువత వీటికి ఎందుకు దూరంగా ఉండాలని కుటుంబం, సమాజంపై దాని ప్రభావం వంటి అంశాలు ఎంత ముఖ్యమో వివరించారు.వీటివల్ల శారీరక నష్టాలు,కాలేయం,మెదడు,గుండె వంటి అవయవాలు పాడై,రోగనిరోధక శక్తి తగ్గిపోతుంది.చివరికి ప్రాణం కూడా పోవచ్చునని,అంతేగాక మానసిక నష్టాలు,ఏకాగ్రత లోపించడం,మతిమరుపు,నిరాశ,ఆందోళన,పిచ్చిగా ప్రవర్తించడం వంటివి కూడా జరుగుతాయి.అలాగే కుటుంబ కలహాలు,స్నేహితులకు దూరం కావడం,నేరాలు చేయడం,సమాజంలో గౌరవం కోల్పోవడం జరుగుతుందన్నారు.యువజన దినోత్సవ సందర్భంగా మీరే మన దేశ భవిష్యత్తు,మీ శక్తిని,తెలివిని మంచి పనుల కోసం ఉపయోగించండి. స్పోర్ట్స్ చదువు,కళలు వంటి వాటిపై దృష్టి పెట్టండంటూ యువతకు సందేశం ఇచ్చారు.స్నేహితులు డ్రగ్స్ తీసుకుంటుంటే వారిని మాన్పించడానికి ప్రయత్నించండని,డ్రగ్స్ మిమ్మల్ని ఒక చిన్నమాయాజాలంలో బంధించి,మీ జీవితాన్ని చీకటి చేస్తాయని హెచ్చరించారు.

# ఘనంగా స్వామి వివేకానంద జయంతి వేడుకలు

**నాచారం, తెలంగాణ చౌరస్తా:**



నాచారం డివిజన్ లో స్వామి వివేకానంద 163వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. డివిజన్ బీజేపీ అధ్యక్షులు కొమ్మగల్ల నవీన్ కుమార్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద చిత్రపటానికి ఎప్పుడు మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ స్వామి వివేకానంద భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలను ప్రపంచానికి పరిచయం చేసి, భారత జాతి ఆత్మగౌరవాన్ని విశ్వవ్యాప్తం చేసిన మహానుభావుడని వక్తలు గుర్తు చేశారు.ఆయన యువతకు స్ఫూర్తిదాయకమైన జీవితం, ఆలోచనలు దేశ భవిష్యత్తుకు మార్గదర్శకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర గిరిజన మోర్చా అధ్యక్షులు రవినాయక్ మాట్లాడుతూ స్వామి వివేకానంద ఆశయాలను సాకారం చేయడానికి ప్రతి బీజేపీ కార్యకర్త సంకల్పం తీసుకోవాలని పిలుపునిచ్చారు. యువత దేశ నిర్మాణంలో ముందుండాలని, సేవా భావంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అనిత పద్మా రెడ్డి, మల్కా ప్రకాష్ రావు, బేక్కరీ రవీందర్ రెడ్డి, కాటేపల్లి రవీందర్ రెడ్డి, అభిషేక్ గౌడ్ చిల్లా అశోక్ గౌడ్, పాదం వెంకటేష్, ఉదయ్ కిరణ్ రెడ్డి,రవికాంత్, యోగేశ్వర,వర లక్ష్మి, ఆనంద కుమార్, నవీన్ రెడ్డి, సురేందర్ స్వామి , కృష్ణా గౌడ్, శేఖర్, శ్రీనివాస్ యాదవ్, నర్సింగ్ రావు, బాల కృష్ణ, వెంకటేష్వర్లు, ప్రవీణ్ కుమార్, బాలరాజ్, కిషోర్, మోహన్ అగర్వాల్, సాయి, కార్యకర్తలు పాల్గొన్నారు.



## స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి

**నాచారం,తెలంగాణ చౌరస్తా:**

జాతీయ యువజన దినోత్సవాన్ని నాచారంలో ఘనంగా నిర్వహించారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని ఎస్ఎస్ఎస్ యువసేన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ యువతకు మార్గ నిర్దేశం చేసినమహనీయుడని కొనియాడారు. ఆయన బోధనలను స్ఫూర్తిగా తీసుకొని నవ భారతనిర్మాణంలోభాగస్వామ్యం కావాలని సూచించారు.వివేకానందుని ఆశయాలను ప్రతి ఒక్కరు నెరవేర్చాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సైనికుడు సంతోష్ రెడ్డి, కృష్ణారెడ్డి, నందికొండ శ్రీనివాసరెడ్డి, మహేష్ యాదవ్, వి.ఎస్ ప్రకాష్ రెడ్డి, క్రాంతి కిషోర్, సుంకసారి వెంకటేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్రాంతికి ఊరెళ్తున్నారా...జరభద్రం

- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు
- కొత్తవారి కదలికలపై నిఘా ఉంచండి.
- కాలనీల్లో, ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు శ్రేయస్కరం.
- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్

**నారాయణపేట,తెలంగాణ చౌరస్తా:**



సంక్రాంతి పండుగ సందర్భంగా పిల్లలకు సెలవులుండటంతో చాలా మంది ప్రయాణాలు చేస్తారు.ఊర్లకు వెళ్తారు.ఇదే అదనుగా దొంగలు చేతివాటం ప్రదర్శిస్తారు.ఊళ్లకు వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలని,ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ దృష్ట్యా చోరీల నియంత్రణకు అన్ని చర్యలు చేపట్టామని,ప్రజలను అప్రమత్తం చేస్తున్నామన్నారు.రాత్రి వేళల్లో,వీధుల్లో గస్తీ ఏర్పాటు చేస్తున్నామన్నారు.ఈ విషయంలో జిల్లా పరిధిలోని ప్రజలు కూడా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు అయన పలు సూచనలు చేశారు.దూర ప్రాంతాలకు వెళ్లేవారు తమ ఇంటి చిరునామా,ఫోన్ నెంబర్‌ను సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులకు తెలపాలి.దీంతో వారి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేసుకుని ఊర్లెళ్లిన వారి ఇళ్లపై నిఘాను ఏర్పాటు చేస్తామని తెలిపారు.మీరు ఇంట్లో లేని సమయంలో మీ ఇంటిని గమనిస్తూ ఉండమని,మీ ఇంటి దగ్గర గల మీకు నమ్మకమైన ఇరుగు పొరుగు వాళ్ళకు చెప్పడం మంచిది.నారాయణపేట జిల్లాలో పోలీసులు ఇప్పటికే సీసీటీవీలను ఇన్‌స్టాల్ చేశామని తద్వారా ఎన్నో సంచలనాత్మక నేరాలను ఛేదించామన్నారు.ప్రజలు తమ కాలనీలు,ఇళ్లు,పరిసరాలు,షాపింగ్ మాళ్లలో సీసీ కెమెరాలు అమర్చుకోవాలి.విలువైన వస్తువులను స్కూటర్ డిక్కీల్లో,కారులలో పెట్టడం చేయరాదు.ద్విచక్రవాహనాలు,కారులను ఇంటి ఆవరణలోనే పార్కింగ్ చేయాలి. రోడ్లపై నిలుపరాదు.బీరువా తాళాలను ఇంట్లో ఉంచరాదు.తమతోపాటే తీసుకెళ్లాలి.ఇంటికి తాళం వేసిన తర్వాత తాళం కనబడకుండా డోర్ కర్టెన్ వేయాలి.గ్రామాలకు వెళ్లే వారు ఇంట్లో ఏదో ఒక గదిలో లైటు వేసి ఉంచాలి. వాచ్ మెన్,సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు.



## ప్రజారోగ్యం కోసమే ఓపెన్ జిమ్ లు

- భారతి నగర్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి

**పటాన్ చెరు, తెలంగాణ చౌరస్తా :**

ప్రజల ఆరోగ్యం కోసం ఓపెన్ జిమ్ లు ఎంతో మేలని భారతీనగర్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి అన్నారు. భారతినగర్ డివిజన్‌లోని ఎల్ఐజీ కాలనీ పార్క్ వద్ద కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి ఓపెన్ జిమ్ నిర్మాణానికి సంబంధించిన పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సింధు మాట్లాడుతూ..ఓపెన్ జిమ్‌ల ద్వారా పిల్లలు, యువత, మహిళలు, వృద్ధులు వ్యాయామం చేసి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవచ్చని తెలిపారు. ప్రజారోగ్యాన్ని మెరుగుపరచడమే లక్ష్యంగా పార్కులలో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐజి కాలనీ సొసైటీ అధ్యక్షులు యాదగిరి రెడ్డి, డైరెక్టర్లు రాజా లింగంపల్లి, రామ్ బాబు, బీఆర్ఎస్ నాయకులు దేవేంద్రచార్య, పాటి సత్యనారాయణ, ఘౌస్, వెంకట్ రెడ్డి, బీఆర్ఎస్ మహిళా సర్కిల్ అధ్యక్షురాలు రాణి యాదవ్, బీఆర్ఎస్ యువజన అధ్యక్షులు మహేష్, సత్యవతి, అరుణ, నర్సింహా రెడ్డి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

- టియుసిఐ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి రవి

**తొర్రూర్-తెలంగాణ చౌరస్తా:**

రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలి అన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ ను నిరసిస్తూ ఈనెల 18న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని టియుసిఐ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి రవి పిలుపునిచ్చారు.నేడు తొర్రూర్ లోని మాస్ లైన్ పార్టీ కార్యాలయంలో జరిగిన ఒక సమావేశంలో ఆయన ప్రసంగించారు. ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టియుసిఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జనవరి 18న హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం మినీ హాల్లో జరుగు రాష్ట్ర సదస్సులో జయప్రదం చేయాలని కోరారు. దేశ, విదేశ పెట్టుబడిదారులకు కార్పొరేటు శక్తులకు అనుకూలంగా 45 కోట్ల మంది కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన ఈ లేబర్ కోడ్స్ వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన అన్నారు. కార్మికులకు సంఘం పెట్టుకునే హక్కు సమ్మె చేసే హక్కు వేతనాలు పెంచమని అడిగే హక్కును కోల్పోతున్న ఈ కోడ్స్ ద్వారా కట్టు బానిసలుగా మారనున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ లేబర్ కోడ్స్ ను అమలు చేయమని తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం చేయాలని రవి డిమాండ్ చేశారు. ఈ రాష్ట్ర సదస్సులో రిటైర్డ్ కార్మిక శాఖ అధికారులు, టీ యు సి ఐ రా జాతీయ ఉపాధ్యక్షుడు వి కృష్ణ రాష్ట్రఅధ్యక్ష కార్యదర్శులు కే సూర్యం, ఎస్ ఎల్ పద్మ తదితరులు వక్తలుగా హాజరు కానున్నారని ఆయన తెలిపారు.ఈ సమావేశంలో టియుసిఐ జిల్లా నాయకులు పాడియా బీకు, తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అర్వపల్లి వెంకన్న, తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు బైరు శ్రీనివాస్, తెలంగాణ ప్రగతిశీల హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు వడ్లకొండ లక్ష్మయ్య పెయింటర్స్ యూనియన్ నాయకులు మంగళపల్లి వెంకట, కృష్ణ, మాచర్ల మురళి, పుల్లయ్య, సాయిలు తదితరులు పాల్గొన్నారు...



## విశ్వభారతిలో ఘనంగా స్వామి వివేకానంద జయంతి

**రామగుండం,తెలంగాణ చౌరస్తా:**

రామగుండం ఎన్టీపీసీ లోని విశ్వభారతి విద్య సంస్థలలో ఘనంగా స్వామి వివేకానంద జయంతి వేడుకలను పాఠశాలల చైర్మన్ బంధారపు యాదగిరి గౌడ్ నిర్వహించారు.ఈ సందర్భంగా కార్యక్రమంలో భాగంగా స్వామి వివేకానంద చిత్రపటానికి పాఠశాల చైర్మన్ యాదగిరి గౌడ్ పూలమాలవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ... స్వామి వివేకానంద నేటి యువతకు ఆదర్శ ప్రాయుడిని,వారి ఆశయాలను ముందుకు తీసుకువెళుతున్నటువంటి బాధ్యత యువతపై ఉందని, తెలియపరిచారు. ప్రతి ఒక్క యువత స్వామి వివేకానంద అడుగుజాడల్లో ముందుకు నడవాలని,యువత సన్మార్గంలో నడిస్తే దేశం అభివృద్ధి పదంలో నడుస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రవీణ్ గౌడ్, ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు శైలజ , తదితరులు పాల్గొన్నారు.



### ఎస్ఐఎస్ఎఫ్–2026 విజయవంతానికి

## సమన్వయమే కీలకం

- తెలంగాణ ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ రమేష్

**పటాన్ చెరు తెలంగాణ చౌరస్తా :**

ఈ నెల 18 నుంచి 23 వరకు సంగారెడ్డి జిల్లా రామచంద్రపురం మండలం కొల్లూరులోని గాడియం ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహించనున్న సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్ (ఎస్ఐఎస్ఎఫ్)-2026ను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని తెలంగాణ ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ రమేష్ సూచించారు. సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్ (SISF)-2026 ఏర్పాట్లలో భాగంగా సోమవారం తెలంగాణ ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ రమేష్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సైన్స్ ఫెయిర్‌కు తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరుకానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించేందుకు మొత్తం 22 కమిటీలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వసతి, భోజనం, రవాణా, భద్రత, పారిశుధ్యం, వైద్య సదుపాయాలు, విద్యుత్, తాగునీరు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతి కమిటీకి కేటాయించిన బాధ్యతలను నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రతిష్టకు ఈ సైన్స్ ఫెయిర్ మైలురాయిగా నిలవనున్నందున అధికారులు సమష్టిగా పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు, జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి, నోడల్ అధికారి లింబాజీ , ఎంఈఓ నాగేశ్వర్ నాయక్, విజయ్ కుమార్, వివిధ కమిటీల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా స్వామి వివేకానంద జయంతి

**నారాయణపేట,తెలంగాణ చౌరస్తా:**

భారతదేశ ఔనత్యాన్ని ప్రపంచదేశాలకు చాటిన మహానుభావుడు స్వామి వివేకానంద అని నారాయణపేట మండలం,అప్పిరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ వెంకట్ అన్నారు. సోమవారం స్వామి వివేకానంద 163వ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ స్వామి వివేకనందుడు దేశ ప్రజలకు ఆదర్శంగా నిలిచాడని,నేటి యువతకు స్ఫూర్తి ప్రదాతగా నిలిచారని తెలిపారు.యువత ఆయన ఆశయాలను,ఆయన చూపించిన మార్గంలో నడిచి దేశాన్ని అన్ని రంగాలలో ముందువరుసలో నిలబెట్టే జ్ఞానాన్ని సంపాదించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెంకట్,వార్డు మెంబర్ రవి,అనిల్,గ్రామ పెద్దలు మాణిక్యప్ప,గావినోళ్ళ సంజీవ్,రంగారెడ్డి,హన్మంత్ ఆదివప్ప,యువకులు శంకర్,రాము,గుడిసె నరసింహ,ఆంజనేయులు,బొక్కనరసింహ, భగవంత్,జైపాల్ పాల్గొన్నారు.

### ఘనంగా స్వామి వివేకానంద

## జయంతి వేడుకలు

**తెలంగాణ చౌరస్తా,హైదరాబాద్:**

వ్యక్తిత్వమే మనిషిని మహోన్నతుడిగా తీర్చిదిద్దుతుందన్న సత్యానికి సజీవ రూపం స్వామి వివేకానంద అని స్కై ఫౌండేషన్,ఫౌండర్ & ప్రెసిడెంట్ డాక్టర్. వై. సంజీవ కుమార్ పేర్కొన్నారు. ఆలోచనలో స్పష్టత, ఆచరణలో ధైర్యం, విజయంపై అచంచల విశ్వాసంతో యువతకు వెలుగుదారి చూపిన మహనీయుడని అన్నారు. అలాంటి మహోన్నతమైన స్వామి వివేకానంద జయంతిని స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించి నివాళులు అర్పించాము.యువత మంచి ఆలోచనలతో ముందుకు సాగితే దేశ భవిష్యత్తు ప్రపంచానికి గర్వకారణంగా నిలుస్తుందన్నారు. వివేకానందుని బోధనలు నేటికీ యువ హృదయాలకు ప్రేరణగా నిలుస్తున్నాయి. ఈ కార్యక్రమములో



ప్రెసిడెంట్ డాక్టర్. వై సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఓ.పావని తదితరులు పాల్గొన్నారు.




# స్వామి వివేకానందను యువత ఆదర్శంగా తీసుకోవాలి

- మార్కెట్ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి

**నూతనకల్ తెలంగాణ చౌరస్తా:**
భారతజాతి చరిత్రను,ఔన్నత్యాన్ని ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి స్వామి వివేకానంద అని తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి అన్నారు.సోమవారం మండల కేంద్రంలోని రైతు బజార్ చికెన్ సెంటర్ యజమాని గొడిశాల రేణుక లింగన్న గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వామి వివేకానంద జయంతి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.స్వామి వివేకానంద స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని పేర్కొన్నారు.యువతలో ఆత్మవిశ్వాసం, స్నేహభావం,ధైర్యం పెంపొందించుకోవడంలో స్వామి వివేకానంద బోధనలు మార్గదర్శకంగా నిలుస్తాయన్నారు.స్వామి వివేకానంద జీవితం,వారి సందేశాలు నేటి సమాజానికి అత్యంత అవసరమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాసరావు, మండల అభివృద్ధి అధికారి సునీత,ఎస్సై నాగరాజు,స్థానిక సర్పంచ్ మహేశ్వరం మల్లికార్జున్, బిజెపి తుంగతుర్తి నియోజకవర్గ కన్వీనర్ కాప రవికుమార్, ఆలయ చైర్మన్ చంద్రారెడ్డి, నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ మారగాని వెంకట్ గౌడ్,మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పసుల అశోక్ యాదవ్,నాగం సుధీర్ రెడ్డి, సురేందర్ గౌడ్,మద్ది సంజీవరెడ్డి,భూతం సాగర్, లింగరాజు,రామ్ రెడ్డి,విటల్ రెడ్డి, బోల్క గణేష్,వీరు యాదవ్, భరత్ తదితరులు పాల్గొన్నారు.



# కొబ్బరిసాగులో యాంత్రీకరణను సద్వినియోగం చేసుకోండి

- ఆత్మ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు

**అశ్వారావుపేట,తెలంగాణ చౌరస్తా:**
అశ్వారావుపేట భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొబ్బరి సాగులో ప్రభుత్వం అందించే రాయితీలను ఉపయోగించుకుని యాంత్రీకరణను పెంపొందించుకోవాలని ఆత్మ (బీఎఫ్ఏసీ) చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు రైతులకు సూచించారు. స్థానిక రైతు వేదికలో సోమవారం కొబ్బరి అభివృద్ధి మండలి ఆధ్వర్యంలో, తెలంగాణ కొబ్బరి సాగుదారుల సంఘం పర్యవేక్షణలో 46వ కొబ్బరి వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సంఘం బాధ్యులు కొక్కెరపాటి పుల్లయ్య నేతృత్వం వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సుంకవల్లి వీరభద్రరావు మాట్లాడుతూ,తెలంగాణ ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తోందని, వాటిని రైతులు అందిపుచ్చుకోవాలని కోరారు. కొబ్బరి అభివృద్ధి మండలి డిప్యూటీ డైరెక్టర్ (డిడి) జీవీ మంజునాథ్ రెడ్డి మాట్లాడుతూ,ఉద్యాన పంటల్లో పామాయిల్ కు ధీటుగా దీర్ఘకాలం పాటు అధిక ఆదాయం



ఇచ్చే వనరు కొబ్బరి సాగు అని పేర్కొన్నారు .ఈ సందర్భంగా బోర్డు ద్వారా అమలు చేస్తున్న వివిధ పథకాలను ఆయన రైతులకు వివరించారు.కొబ్బరి రైతు సంఘం నేత పుల్లయ్య మాట్లాడుతూ బోర్డు అందించే రాయితీలను సద్వినియోగం చేసుకుని కొబ్బరి సాగు విస్తీర్ణాన్ని పెంచాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఏడీ రఘుతన్, ఏడీఏ పెంటేల రవికుమార్, వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ నీలిమ, హెచ్ఈఓ ఈశ్వర్, పాక్స్ మాజీ అధ్యక్షులు చిన్నంశెట్టి సత్యనారాయణ, తలశిల ప్రసాద్, తుమ్మ రాంబాబు, కాసాని పద్మ శేఖర్, ఆళ్ళ నాగేశ్వరరావు, సీమకుర్తి వెంకటేశ్వరరావు, పసుపులేటి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



# నర్సరీ నిర్వహణకు శిక్షణ కార్యక్రమం

- నర్సరీ నిర్వహణలో తాగు జాగ్రత్తలు పాటించాలి

**కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:**
మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లో భాగంగా 2026 27 నర్సరీ నిర్వహణకు సంబంధించిన శిక్షణను స్థానిక ఎంపీడీవో రామ్మోహన్ ఆధ్వర్యంలో మండలంలోని తారుపల్లి గ్రామపంచాయతీ నర్సరీలో నిర్వహించారు.ఈ శిక్షణకు మండలంలోని 24 గ్రామ పంచాయతీల కార్యదర్శి కార్యదర్శిలు,ఫీల్డ్ అసిస్టెంట్లు,మెట్లు పాల్గొన్నారు.ఫారెస్ట్ డిపార్ట్మెంట్ అధికారులు మంగీలాల్,వాయు కుమార్,టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాస్,శిక్షణను ఇచ్చారు.నర్సరీ ప్రారంభం నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలు,బ్యాగు ఫిల్లింగ్ చేయు విధానం,బ్యాగులు కన్వర్షన్స్ చేయు విధానం,గడ్డి కలుపు తీయుట,పురుగుల నివారణ తదితర అంశములపై మౌఖికంగా,ప్రయోగాత్మకంగా వివరించారు.ఈ కార్యక్రమంలో తారుపల్లి గ్రామ సర్పంచ్ గాజనవేణ స్వరూప సదయ్య,ఎంపీఓ ఆరిఫ్ హుస్సేన్,ఏపీవో మంజుల,టెక్నికల్ అసిస్టెంట్లు శ్రీనివాస్, మమత,పంచాయతీ కార్యదర్శులు,ఫీల్డ్ అసిస్టెంట్లు,మేట్స్ పాల్గొన్నారు.



# రండి కలిసి పని చేద్దాం..కమలానికి వికసింపజేద్దాం

- మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటుదాం
- మెదక్ ఎంపీ రఘునందన్ రావు
- ఇంద్రేశం మున్సిపాలిటీ నుంచి బీజేపీలో భారీగా చేరికలు

**పటాన్ చెరు,తెలంగాణ చౌరస్తా :**
రానున్న మున్సిపల్ ఎన్నికల్లో సత్తాచాటి బీజేపీ జెండా ఎగురవేయడం ఖాయమని మెదక్ ఎంపీ రఘునందన్ రావు ధీమా వ్యక్తం చేశారు. పటాన్ చెరు నియోజకవర్గం పరిధిలోని ఇంద్రేశం మున్సిపాల్టీకి చెందిన యువ నాయకులు హర్షవర్ధన్ రెడ్డి, శివారెడ్డి తదితరుల ఆధ్వర్యంలో వివిధ గ్రామాలకు చెందిన యువకులు, వివిధ పార్టీల నాయకులు బీజేపీలో చేరారు. మందు మూల శివరెడ్డి, మందుమూల హర్షారెడ్డి,రాజేందర్ సింగ్, కుల్కూర్ రాంరెడ్డి, మనీష్, నందీశ్, వినోద్ గౌడ్, మహేష్ గుప్తా, విఘ్నేష్, ప్రవీణ్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డితో పాటు సుమారు 100 మంది కాషాయం కండువాలు కప్పుకున్నారు. సోమవారం సంగారెడ్డి బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరితో కలిసి పార్టీలో చేరిన వారిని బీజేపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా ఎన్నికలు ఎక్కడ, ఎప్పుడు జరిగినా ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని అన్నారు. గత పన్నెండేళ్ళలో ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశానికి సరైన దిశను నిర్దేశించి అగ్రరాజ్యంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం శ్రమించిందని చెప్పారు. అందువల్లే ప్రపంచ వ్యాప్తంగా భారత ప్రతిష్ట ఇనుమడించిందన్నారు. వివిధ దేశాల యువత ఆ దేశాల్లో తీవ్రమైన ఆందోళనలు చేస్తూ తమకు కూడా మోడీ లాంటి నాయకుడు, బీజేపీ లాంటి ప్రభుత్వం కావాలని కోరుకుంటున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు అని అన్నారు. తెలంగాణాలో కూడా భవిష్యత్ బీజేపీదే అని పునరుద్ఘాటించారు. పదేళ్ల టీఆర్ఎస్ పాలన, రెండేళ్ల కాంగ్రెస్ పాలనకు పెద్ద తేడా లేదని ప్రజలు భావిస్తున్నారని, అందుకే బీజేపీని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీజేపీలో చేరుతున్నారని అన్నారు. రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో డబుల్ ఇంజన్ సర్కార్ రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# ఛత్రపతి శివాజీ యువసేన నూతన కమిటీ నియామకం

**కమాన్ పూర్,తెలంగాణ చౌరస్తా:**
చత్రపతి శివాజీ యువసేన కమాన్ పూర్ మండల నూతన అధ్యక్షుడిగా మల్యాల శేఖర్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా గుంజపడుగు నరేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.గత 12 సంవత్సరాలుగా వివిధ రంగాల్లో రక్తదానాల్లో, సేవా కార్యక్రమాల్లో, వేసవి కాలం లో చలివేంద్రం, అంబలి పంపిణీ,హిందుత్వపరంగా మహాశివరాత్రి, శ్రీ దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తూన్న చత్రపతి శివాజీ యువసేన ఇకముందు నూతన నాయకత్వంలో ముందుకు సాగనుంది. ఈ యొక్క నూతన నియామకం కార్యక్రమంలో చత్రపతి శివాజీ యువసేన వ్యవస్థాపకులు జంగపల్లి శ్రీనివాస్



, యువసేన నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# డీ–83 ఉపకాల్వకు మరమ్మత్తులు చేపట్టాలి

**పెద్దపల్లి,తెలంగాణ చౌరస్తా:**
ఎస్సారెస్పీ డీ-83 ఉపకాల్వ ఆర్ఎస్డీ4ను వెంటనే మరమ్మత్తులు చేపట్టి కాల్వశ్రీరాంపూర్ మండలంలోని చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నేషనల్ కోఆర్డినేటర్ ఆకుల స్వామి వివేక్ పటేల్ డిమాండ్ చేశారు. సోమవారం ప్రజావాణిలో అదనపు కలెక్టర్ దాసరి వేణుకు వినతిపత్రం అందజేశారు. కాల్వశ్రీరాంపూర్ మండలంలోని చిట్టచివరి గ్రామాలైన జాఫర్ఖాన్పేట, పెద్దరాతిపల్లి,ఇద్దులాపూర్ రైతులకు ఎస్సారెస్పీ సాగు నీరు అందడం లేదని,ఉపకాల్వకు మరమ్మత్తులు చేపట్టి,పిచ్చిమొక్కలను తొలగించి రెండోవిడతలోనైనా నీళ్లు అందేలా చూడాలని అధికారులను విజ్ఞప్తి చేశారు.స్వామి వివేక్పటేల్తో పాటు బీసీ జేఏసీ రాష్ట్ర కో కన్వీనర్ రాజేందర్నేత పలువురు రైతులున్నారు.



# సావిత్రమ్మ సేవలు మరువలేనివి

- కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ నేతలు

**నూతనకల్ తెలంగాణ చౌరస్తా**
కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ బాణాల సుదర్శన్ రెడ్డి సతీమణి బాణాల సావిత్రమ్మ నాలుగవ వర్ధంతి సందర్భంగా చిల్పకుంట్ల గ్రామ కాంగ్రెస్ పార్టీ నేతలు వారి ఫోటోకు పూలమాలవేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారి కుటుంబానికి పార్టీ తరపున ప్రగాఢ సానుభూతిని సావిత్రమ్మ కాంగ్రెస్ పార్టీకి చేసిన మేలును,సహాయ సహకారాలను గుర్తు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో చిల్పకుంట్ల గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పులుసు సైదులు, ఉపాధ్యక్షులు బాణాల మల్లారెడ్డి,మార్కెట్ కమిటీ డైరెక్టర్ బత్తుల నాగమల్లు, ఎస్సి సెల్ మండల అధ్యక్షులు ఏర్పుకొండ సురేష్ ,కార్యదర్శి పంతం వెంకన్న బత్తుల మల్లయ్య, పులుసు, రవి, బత్తుల రమేష్,బత్తుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# సారయ్య కు వివేకానంద స్ఫూర్తి పురస్కారం

**కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:**
కాల్వ శ్రీరాంపూర్ మండల మాజీ ఎంపీపీ ,మాజీ జెడ్పిటిసి గోపగోని సారయ్య గౌడ్ వివేకానంద జన్మదిన సందర్భంగా హైదరాబాదులోని త్యాగరాజ గాన సభలో శ్రీస్వామి వివేకానంద స్ఫూర్తి పురస్కారం అందుకున్నారు.ప్రజా ప్రతినిధిగా ఎంపీటీసీ,జడ్పిటిసి,ఎంపీపీ గా ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజాసేవే లక్ష్యంగా పనిచేస్తూ,గత 30 సంవత్సరాలుగా ప్రజలందరికీ ఎన్నో సేవలు అందించి నందుకుగాను,జాతీయ తెలుగు సారస్వత పరిషత్,ఆది లీల ఫౌండేషన్ న్యూఢిల్లీ వారి సంయుక్త ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా గోపగోని సారయ్య గౌడ్ కు మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాల చారి,వకులాభరణం కృష్ణమోహన్,మెజిస్ట్రేట్ టీ నర్సిరెడ్డి చేతుల మీదుగా వివేకానంద స్ఫూర్తి పురస్కారం అందుకున్నారు.ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ.... ప్రజా ప్రతినిధిగా ఎల్లవేళలా ప్రజలకు ఎంతో సేవలు అందిస్తున్న గోపగోని సారయ్య గౌడ్ మరిన్ని గొప్ప గొప్ప పదవుల్లో ఉండాలని కోరుకుంటున్నామని అభినందించారు.ఈ కార్యక్రమంలో జాతీయ తెలుగు సారస్వత పరిషత్ అధ్యక్షుడు కేసిరాజు రాం ప్రసాద్,ఆ శాఖ తెలంగాణ విభాగం ప్రధాన కార్యదర్శి ఇప్పలపల్లి చంద్రహాస్,ఆది లీల ఫౌండేషన్ న్యూఢిల్లీ ఫౌండర్ చైర్మన్ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



# చాణక్యలో ఘనంగా యువజన దినోత్సవం

**జమ్మికుంట, తెలంగాణ చౌరస్తా :**
జమ్మికుంట పట్టణంలోని చాణక్య డిగ్రీ కళాశాలలో జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ మాట్లాడుతూ.... స్వామి వివేకానంద ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని జీవితంలో విజయం సాధించాలని కోరారు.శుక్రవారం రోజు ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాల కరీంనగర్ వారు నిర్వహించిన నేషనల్ లెవెల్ యూత్ ఫెస్ట్ మేధా 2కె26 లో వివిధ విభాగాలలో బహుమతులు పొందిన విద్యార్థులు జి.రుచిత బీ.కాం థర్డ్ ఇయర్,ఏ.రవళి,నాగమణి,హాసిని,పద్మావతి బీ.ఎస్సీ ఎంపీసీఎస్ సెకండియర్,బెస్ట్ క్యాంపస్ అంబాసిడర్ గా నిలిచిన సమీరా బి.కాం సెకండ్ విద్యార్థినులను అభినందించారు.ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ దబ్బేట విజయ రవీందర్,డైరెక్టర్లు ప్రభాకర్, శ్రీనివాస్,విజేందర్ రెడ్డి, చిరంజీవి,శివ,కళాశాల ప్రిన్సిపల్ వి.వంశీకృష్ణ అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



# మిగిలిపోయిన స్పౌజ్ బదిలీలు చేపట్టండి

- పి ఆర్ టి యు తెలంగాణ
- ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్ రెడ్డికి విజ్ఞప్తి

**కరీంనగర్, తెలంగాణ చౌరస్తా:**

317 జీవో వల్ల భార్య ఒక్క జిల్లా,భర్త ఒక జిల్లాగా మారి తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఉపాధ్యాయ దంపతుల బదిలీలు కాంగ్రెస్ ప్రభుత్వము దాదాపుగా 90 శాతం పూర్తి చేసిందని,మిగిలిపోయిన 10 శాతం స్పౌజ్ బదిలీలు కూడా పూర్తిచేసి స్పౌజ్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని,పి ఆర్ టి యు తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షులు గాల్ రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు ఎం.చెన్నయ్య బృందం ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్ రెడ్డిని కలిసి ప్రాతినిధ్యం చేయడం జరిగింది.స్పందించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలోగా మిగిలిపోయిన అన్ని స్పౌజ్ బదిలీలు పూర్తి చేస్తామని,స్పౌజు ఉపాధ్యాయులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పిఆర్టియు తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.చంద్రశేఖర్ రావు,పి ఆర్ టి యు తెలంగాణ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు గోనె శ్రీనివాస్, నాయకులు ఇప్పలపల్లి చక్రధర్,తోట వీరేందర్,గడమల్ల శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.



# వేతనాలు చెల్లించని ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్

**ఆసిఫాబాద్, తెలంగాణ చౌరస్తా:**

ఆసిఫాబాద్ మెడికల్ కాలేజీలో గత మూడు నెలల నుంచి పెండింగ్లో ఉన్న వేతనాలు చెల్లించని ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు.పెండింగ్లో ఉన్న వేతనాలు చెల్లించాలని,ఇతర సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ శుభోదయం కుమార్ కి మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ (ఏఐటియుసి) యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా బోగే ఉపేందర్ మాట్లాడుతూ... పెండింగ్లో ఉన్న వేతనాలు చెల్లించాలని అలాగే ఈపీఎఫ్,ఈఎస్ఐ,ఇన్సూరెన్స్,ఐడి కార్డ్స్,అపాయింట్మెంట్ లెటర్స్,డ్రెస్ కోడ్ తో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అనేక సార్లు కాంట్రాక్టర్ల దృష్టికి తీసుకెళ్లిన సమస్య పరిష్కరించడం లేదన్నారు.చెల్లించకపోవడంతో కార్మికులు,వారి కుటుంబ సభ్యులు పస్తులు ఉండవలసిన పరిస్థితి వచ్చిందన్నారు.ఇప్పటికైనా పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించి నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏజెన్సీల పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిబ్బంది,సందీప్,షేకు,సాయి,దేవిక,సిమ్రాన్ భాను,రాంజీ,మహేష్,రోజా, అశ్విని తో పాటు తదితరులు పాల్గొన్నారు.



# గ్రామాల అభివృద్ధియే రాష్ట్రప్రగతికి పునాది

- ఎమ్మెల్యే యశస్విని రెడ్డి
- మండలాల్లో ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటన
- గ్రామాల్లో పెండింగ్ పనులకు ప్రారంభోత్సవాలు
- ప్రతి గ్రామ అభివృద్దే ప్రజా ప్రభుత్వ లక్ష్యం
- కళ్యాణలక్ష్మి–షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ
- సోమారంలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభం



**తెలంగాణ చౌరస్తా, పాలకుర్తి :**

పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి సోమవారం రాయపర్తి, తొర్రూర్ మండలాల్లో విస్తృతంగా పర్యటించారు.ఈ సందర్భంగా పలు గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులకు ఆమె శంకుస్థాపన చేశారు.మండలాల్లోని పలు గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న పనులను ప్రారంభించి, కొత్త ప్రాజెక్టులకు పునాది వేశారు.గ్రామ స్థాయిలోనే అభివృద్ధి మొదలవ్వాలని, పల్లెలు బాగుంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని ఆమె పేర్కొన్నారు.పల్లెలే రాష్ట్రానికి పట్టుకొమ్మలు అని అన్నారు.నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు.

**గుడిబండ తండ**

తొర్రూరు మండలం గుడిబండ తండ గ్రామంలో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనాన్ని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ భవనాల ద్వారా గ్రామ స్థాయిలో పరిపాలనా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని, ప్రజలకు అవసరమైన సేవలు సులభంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. గుడిబండ తండా గ్రామ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామ సర్పంచులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు.. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హమ్య నాయక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్,తొర్రూర్ కాంగ్రెస్పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పెదగాని సోమయ్య, పొనుగోటి సోమేశ్వర్ రావు, వివిధ గ్రామాల సర్పంచులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**దుబ్బ తండ**

తొర్రూరు మండలం పెద్ద దుబ్బతండా గ్రామంలో రూ. 20 లక్షల వ్యయంతో చేపట్టనున్న నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనుల ప్రారంభానికి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి శంకుస్థాపన చేశారు.ఈసందర్భంగా మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ భవనం ద్వారా ప్రజలకు మెరుగైన పరిపాలన సేవలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. గ్రామాభివృద్ధి,ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ, పెద్ద దుబ్బతండా గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరచేందుకు తమ పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు.

**సోమారం**



తొర్రూర్ మండలం సోమారం గ్రామంలో హనుమండ్ల ఝాన్సి రాజేందర్ రెడ్డి ఫ్యామిలీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి రావడం ప్రజారోగ్యానికి ఎంతో అవసరమని తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొంటూ, హనుమాండ్ల ఝాన్సి రాజేందర్ రెడ్డి ఫ్యామిలీ చారిటబుల్ ట్రస్ట్‌ను అభినందించారు. గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజాస్వామ్య సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.



**రాయపర్తి**

రాయపర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని రాయపర్తి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 28 మంది అర్హులైన లబ్ధిదారులకు మొత్తం రూ. 28,03,248/ రూ. విలువైన కళ్యాణలక్ష్మి-షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారుల చేతికి అందజేశారు..ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేద,బలహీన వర్గాల కుటుంబాల్లో ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక భారం తగ్గించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ వచ్చేల పారదర్శకంగా,జరుగుతుందని ఎలాంటి మధ్యవర్తులు లేకుండా నేరుగా లబ్ధిదారులకే ఆర్థిక సహాయం అందుతోందని స్పష్టం చేశారు.



**ఖానాపురం**

తొర్రూరు మండలం ఖానాపురం గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (NREGS) నిధుల నుండి మంజూరైన రూ.15 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనుల ప్రారంభానికి పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని అన్నారు. సీసీ రోడ్ల నిర్మాణంతో రాకపోకలు సులభమవుతాయని, గ్రామాభివృద్ధికి ఇవి కీలకమని పేర్కొన్నారు.



**తొర్రూర్**

తొర్రూర్ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని తొర్రూర్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 79 మంది అర్హులైన లబ్ధిదారులకు మొత్తం రూ. 79,09,164/ రూ. విలువైన కళ్యాణలక్ష్మి-షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేద,బలహీన వర్గాల కుటుంబాల్లో ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భారం తగ్గించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. గత పాలనలో ఆ పార్టీ వారికి మాత్రమే సంక్షేమ పథకాలు ఇచ్చే వారు. పారదర్శకంగా అందుతున్నాయని అన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలోని అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా తన వంతు కృషి కొనసాగిస్తానని హామీ ఇచ్చారు.





# పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలి

- రాజ్యాధికారం కోసం ఐక్యంగా ముందుకు సాగుదాం
- బీసీ ఆజాది ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు జక్కని సంజయ్ కుమార్

**హుజురాబాద్, తెలంగాణ చౌరస్తా :**

పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలని,మానవ సమాజం మనుగడ కోసం అనాదిగా సేవ చేస్తున్న పద్మశాలీయులు రాజకీయంగా ఎదగాలని బీసీ ఆజాది ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు జక్కని సంజయ్ కుమార్ అన్నారు.పద్మశాలి సంఘం తరుపున బీసీ ఆజాది ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు జక్కని సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా గెలుపొందిన పద్మశాలి కులానికి చెందిన నాయకులు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించిన నాయకులకు సన్మానం కార్యక్రమాలను నిర్వహించారు.సైదాపూర్ మండలంలోని బొమ్మకల్ సర్పంచ్ వేముల శ్రీకాంత్,వార్డు సభ్యులు అశోక్,ఎగ్లాసపూర్ వార్డు సభ్యులు రాపెల్లి పద్మ రమేష్, బూడిదపల్లి వార్డు సభ్యులు చిలువేరి రాములు,వెనకపల్లి వార్డు సభ్యులు కొండ వెంకటేశ్వర్లు,సైదాపూర్ వార్డు సభ్యులు వంగ తిరుమలేశ్ ఆయా గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి సన్మానం చేశారు.ఎన్నికైన పద్మశాలి సమాజానికి చెందిన నాయకులకు బీసీ ఆజాది ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు జక్కని సంజయ్ కుమార్,జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి వోడ్నాల రవీందర్ తో కలిసి సన్మానం కార్యక్రమాలను నిర్వహించారు.గ్రామాలకు వెళ్లి పద్మశాలి కులస్తులతో సమావేశాలు ఏర్పాటు చేసి ఎన్నికైన ప్రజాప్రతినిధులను సన్మానం చేశారు.సైదాపూర్ సబ్ ఇన్స్పెక్టర్ గా తన సేవలను అందిస్తున్న కొప్పుల స్వాతి ని మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు.తదనంతరం జక్కని సంజయ్ కుమార్ మాట్లాడుతూ...ఈ రాష్ట్ర జనాభాలో 28 లక్షలకు పైచిలుకు ఉన్న పద్మశాలి కులస్తులు విద్యారంగంలో వైద్యరంగంలో వస్త్ర ఉత్పత్తి రంగంలో సేవ చేస్తున్నారని,అలాగే వివిధ రంగాలలో శ్రామికులుగా ఉన్నారని,ఎంతో నైపుణ్యతతో పనిచేసే పద్మశాలి కులస్తులు ఉద్యోగ,వ్యాపార, రాజకీయ రంగాల్లో వెనుకబడి ఉన్నారని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పద్మశాలి కులానికి ఎలాంటి సహకారం లేదని 28 లక్షల మంది ఈ రాష్ట్రంలో ఉన్నప్పటికీ రాజకీయంగా కొద్దిమంది మాత్రమే ఉన్నారని,కేవలం ఒకే ఒక్క ఎమ్మెల్యే ఉండడం పద్మశాలి కుల వెనుకబాటుతనానికి నిదర్శనమని గ్రామీణ ప్రాంతాల్లో వారి సేవా దృక్పథంతో ముందుకు వచ్చి వార్డు సభ్యులుగా సర్పంచులుగా,ఉప సర్పంచులుగా ఎన్నికైన పద్మశాలి ప్రజాప్రతినిధులకు జిల్లా వ్యాప్తంగా సన్మానాలు చేస్తున్నామని ద్వారా వారికి రాజకీయ స్ఫూర్తిని తీసుకురావడమే లక్ష్యంగా పద్మశాలిల ఐక్యత కోసం పనిచేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు.ఈ కార్యక్రమంలో బీసీ ఆజాది ఫెడరేషన్ రాష్ట్ర కార్య నిర్వహక అధ్యక్షులు కుడికల భాస్కర్,జిల్లా అధ్యక్షులు చిలుకమారి శ్రీనివాస్,పద్మశాలి సంఘం జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి వోడ్నాల రవీందర్,మండల ఉపాధ్యక్షులు గుండెటి శ్రీనివాస్,చిగురుమామిడి మండల అధ్యక్షులు వంగర మల్లేశం,సీనియర్ నాయకులు వంగ సత్యనారాయణ,ఆయా గ్రామాల పద్మశాలి అధ్యక్షులు, కుల బంధువులు పాల్గొన్నారు.

# మారని సింగరేణి కార్మికుల బ్రతుకులు

- ఇన్కమ్ టాక్స్ పేరుతో కార్మికుని నిలువు దోపిడీ
- ఏ ఐ ఎఫ్ టి యు రాష్ట్ర నాయకులు చంద్రగిరి శంకర్

**భూపాలపల్లి, తెలంగాణ చౌరస్తా:**



ప్రభుత్వలు మారిన సింగరేణి కార్మికుల బ్రతుకులు మారడం లేదని,ఇన్కమ్ టాక్స్ పేరుతో కార్మికుడిని నిలువు దోపిడి చేస్తున్నారని ఏఐఎఫ్టియు రాష్ట్ర నాయకులు చంద్రగిరి శంకర్ అన్నారు.ఈ సందర్భంగా చంద్రగిరి శంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... దేశానికి వెలుగులు పంచే సింగరేణి,ఎన్ని ప్రభుత్వాలు మారినా కార్మికులకు జీవితాల్లో మాత్రం వెలుగులు నింపడం లేదన్నారు. ఇన్కమ్ టాక్స్ పేరుతో కార్మికులు సంవత్సర వేతనంలో నాలుగు నెలల వేతనం మొత్తం కూడా ఇన్కమ్ టాక్స్ రూపంలో కట్టడం జరుగుతుందని,సింగరేణి సంస్థ గత రెండు సంవత్సరాల నుండి సిఎంపిఎఫ్ చిట్టిలను కూడా ఇవ్వడం మానేసిందని, దీనివల్ల కార్మికుల గరిష్ట వేతనం నుండి ఎంత మొత్తంలో ఇన్కమ్ టాక్స్ మిగతా టాక్స్ లకు చెల్లిస్తున్నామో తెలియడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు.గత కెసిఆర్ ప్రభుత్వం అసెంబ్లీలో ఇన్కమ్ టాక్స్ రద్దు పై బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించి కేంద్రానికి పంపించిన ఇంతవరకు కేంద్ర ప్రభుత్వం దానిపై చర్యలు తీసుకోలేదన్నారు.ఎక్కడ వేసినా గొంగడి అక్కడే ఉన్న చందం గా ఉన్నదని,యాక్టింగ్ చేసిన అన్ని క్యాటగిరీల కార్మికులకు ప్రమోషన్ లు ఇవ్వాలన్నారు.ఇకనైనా కేంద్ర బీజేపీ,రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వాలు స్పందించి ఇన్కమ్ టాక్స్ రద్దుకై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.





# ఘనంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు

- ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహణ
- గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం
- ఇండస్ ఫౌండేషన్ చైర్మన్ ఏనుగుల రాకేష్ రెడ్డి

**హనుమకొండ, తెలంగాణ చౌరస్తా :**

ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిఖర స్కిల్ సెంటర్ సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా హన్మకొండ వందపీట్ల రోడ్డు జవహర్ కాలనీలోని శిఖర స్కిల్ సెంటర్ లో సంక్రాంతి ముగ్గుల పోటీలు స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది .ఈ సందర్భంగా ఉత్తమ ముగ్గులకు బహుమతులు ప్రదానం చేశారు.ముఖ్య అతిథులుగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు,ఇండస్ ఫౌండేషన్ చైర్మన్ ఏనుగుల రాకేష్ రెడ్డి, ప్రముఖ న్యాయవాది,జునాయిల్ జస్టిస్ బోర్డ్ మెంబర్ గోపికా రాణి హాజరయ్యారు.ఈ సందర్భంగా రాకేష్ రెడ్డి మాట్లాడుతూ...ఆకాశంలో చుక్కలను నేలమీదకు దించి, సమాజంలో అందరూ కలిసి ఉండాలన్నా సందేశాన్ని ఇస్తూ చుక్కలన్నీ కలిపి ముగ్గు వేసి, హరివిల్లును నెలకు దించి ముగ్గులో అందమైన రంగులేసి సంక్రాంతి ముగ్గును వేశారని కొనియాడారు.మహిళలు తమ కాళ్ళమీద తాము నిలబడాలని సాధికారత సాధించాలన్న తపనతో ఈ స్కిల్ సెంటర్ ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ఇంట్లో ఒక ఆడబిడ్డ ఏదో ఒక వృత్తి నైపుణ్యం కలిగి ఉంటే ఆ ఇల్లు కళకళలాడుతుందని,కాబట్టి, మహిళలకు,యువకులను వృద్ధిలోకి తేవడమే మన లక్ష్యం అని అందరూ ఒక కుటుంబ సభ్యుల్లా కలిసిపోవడం సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు.గోపికా రాణి మాట్లాడుతూ... మహిళలు సమాజంలో ఎంతో అణిచివేతకు గురవుతున్న ఈ తరుణంలో వారిలో నైపుణ్యాన్ని పెంపొందించి స్వావలంబన దిశగా అడుగులు వేసేలా చేయడం అభినందనీయం అని,శిఖర స్కిల్ సెంటర్ ను ఉపయోగించుకొని అందరూ ఉన్నత శిఖరాలకు ఎదగాలని, ఒక మహిళా న్యాయవాదిగా మహిళలకు ఎవరికి ఎటువంటి న్యాయ సహాయం కావాలన్న తాము అందించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.మీరు నేర్చుకున్న నైపుణ్యాన్ని ఉపయోగించుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో శిఖర స్కిల్ సెంటర్ నిర్వాహకులు జ్యోతి, భవాని,కార్తీక్ రెడ్డి,గువ్వ రాజేష్,ఇండస్ ఫౌండేషన్ సభ్యులు ఏశబోయిన పురుషోత్తం,అఖిల్ రెడ్డి, లక్ష్మణ్, రమేష్,అనిల్,పవన్, యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.



# పశువుల పాకకు ముగ్గు పోసిన సర్పంచ్ సతీష్

**ఓదెల, తెలంగాణ చౌరస్తా:**

ఓదెల మండల కేంద్రంలోని ఓదెల గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా క్యాటిల్ షెడ్ నిర్మాణం కోసం ఐదుగురు లబ్ధిదారులకు ముగ్గు పోయడం జరిగింది.ఈ సందర్భంగా సర్పంచ్ సతీష్ మాట్లాడుతూ....ప్రజలు ప్రతి స్కీమ్ ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఓదెల శివాలయం దగ్గర 14వ తారీకు ఉదయం నిర్వహించే సంక్రాంతి ముగ్గుల పోటీల్లో పాల్గొని ప్రథమ,ద్వితీయ,తృతీయ బహుమతులు గెలుచుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఓదెల సర్పంచ్ సతీష్,ఈసి శ్వేత,టీ ఏ జనార్ధన్,కార్యదర్శి చంద్రారెడ్డి వార్డు సభ్యులు రాపెల్లి రాజయ్య,రాచర్ల అశోక్, గోపతి ప్రవీణ్,సమ్మయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు



# ఓటర్ల ముసాయిదా ఫైనల్ పబ్లికేషన్ పూర్తి

- మునిసిపల్ మేనేజర్ రాజిరెడ్డి, టిపివో శ్రీధర్

**జమ్మికుంట, తెలంగాణ చౌరస్తా:**

రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జమ్మికుంట మున్సిపాలిటీ ఓటర్ జాబితాను ఫైనల్ పబ్లికేషన్ చేసి జమ్మికుంట మునిసిపల్ కార్యాలయంలోని నోటీస్ బోర్డు లో కమిషనర్ మహమ్మద్ అయాజ్ ఆదేశాల మేరకు ప్రచురించడం జరిగిందని మున్సిపల్ మేనేజర్ జి రాజిరెడ్డి,టిపివో శ్రీధర్ లు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాల మేరకు ఫైనల్ పబ్లికేషన్ పూర్తి చేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో టి.పి.ఎస్.రాజ్ కుమార్,టి.పి.బి.వో దీపిక, ఎఈ వికాస్,జే.ఎ.వో రాజశేఖర్ రెడ్డి,సీనియర్ అస్సిస్తేంట్లు వాణి,భాస్కర్,శ్రీనివాస్ లతో పాటు పలువురు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



# మత్తుకు దూరంగా...మైదానానికి దగ్గరగా

- క్రీడలే యువ భవిష్యత్తుకు బలమైన ఆయుధం
- లక్ష్మిదేవిపల్లి ఎస్ఐ రమణారెడ్డి
- భగత్ సింగ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

**లక్ష్మిదేవిపల్లి, తెలంగాణ చౌరస్తా :**

బావోజి తండా గ్రామ పంచాయతీలో భగత్ సింగ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవం యువతకు స్పష్టమైన దిశానిర్దేశం చేస్తూ ఘనంగా ప్రారంభమయ్యాయి.డ్రగ్స్, మత్తు పదార్థాల ముప్పు నుంచి యువతను రక్షించడమే లక్ష్యంగా,క్రీడలను జీవిత మార్గంగా చూపించేలా ఈ టోర్నమెంట్ నిర్వహించటం విశేషంగా నిలిచింది.లక్ష్మీదేవిపల్లి ఎస్సై రమణ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై టోర్నమెంట్ ను ప్రారంభించారు.ఈ సందర్భంగా యువతను ఉద్దేశించి మాట్లాడిన ఆయన,డ్రగ్స్ వంటి చెడు అలవాట్లు యువ భవిష్యత్తును నాశనం చేస్తాయని,క్రీడలే ఆరోగ్యం, క్రమశిక్షణ,విజయం వైపు తీసుకెళ్లే నిజమైన మార్గమని తెలిపారు.క్రికెట్ లాంటి ఆటల ద్వారా శారీరకంగా మాత్రమే కాకుండా మానసికంగా కూడా బలంగా ఎదగవచ్చని సూచించారు .ఈ కార్యక్రమంలో బావోజి తండా సర్పంచ్ వంకుడోత్ హతిరాం, పెద్ద తండా సర్పంచ్ లావుడ్యా పూర్ణ,హరియా తండ సర్పంచ్ బుజ్జి ,దూదియ తండా సర్పంచ్ రమేష్,గట్టు మల్ల సర్పంచ్ బట్టు కనకరాజు,తదితర ప్రజాప్రతినిధులు పాల్గొని యువతను ఉత్సాహపరిచారు. గ్రామ స్థాయి నుంచే క్రీడా ప్రతిభను వెలికి తీయాలని,యువత క్రికెట్ లో ముందడుగు వేయాలని,క్రీడల ద్వారా మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు.డ్రగ్స్ కు 'నో' చెప్పి,మైదానానికి 'యెస్' చెప్పినప్పుడే గ్రామాల భవిష్యత్తు బాగుపడుతుందని స్పష్టం చేశారు.టోర్నమెంట్ సందర్భంగా ఫస్ట్ ప్రైజ్, సెకండ్ ప్రైజ్ షీల్డ్ లను పెద్ద తండా సర్పంచ్ లావుడ్యా పూర్ణ అందజేశారు.ఈ సందర్భంగా క్రీడాకారులను అభినందిస్తూ, మరింత పట్టుదలతో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.భగత్ సింగ్ వంటి విప్లవ యోధుడి పేరుతో నిర్వహిస్తున్న ఈ క్రికెట్ టోర్నమెంట్ ,యువతను డ్రగ్స్ నుంచి దూరంగా ఉంచి,క్రీడల వైపు నడిపించే ఉద్యమంగా మారాలని ఆకాంక్షించారు.






# బూత్ స్థాయే బీజేపీకి బలమైన పునాది

- బలమైన బూత్‌లు బలమైన పార్టీని నిర్మిస్తాయి
- రాష్ట్ర కార్యదర్శి కొప్పు భాష
- కార్యకర్తల అంకిత భావమే పార్టీ విజయాలకు మూలాధారం
- జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్,మాజీ శాసనసభ్యులు ఆరూరి రమేష్

**వరంగల్, తెలంగాణ చౌరస్తా :**



బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాం చందర్ రావు,రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్ర శేఖర్ తివారి జీ సూచనల మేరకు సంస్థాగత నిర్మాణంలో భాగంగా వరంగల్ హంటర్ రోడ్ లో గల సత్యం కన్వెన్షన్ హాల్ లో జిల్లా కన్వీనర్ ఎరుకల రఘునారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన బూత్ నిర్మాణ్ అభియాన్ జిల్లా కార్యశాల కి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కొప్పు భాష,జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్, మాజీ శాసనసభ్యులు ఆరూరి రమేష్ పాల్గొన్నారు.అనంతరం వారు మాట్లాడుతూ...బూత్ స్థాయే బీజేపీకి బలమైన పునాది.ప్రతి నాయకుడు ముందుగా తమ తమ బూత్‌లను పటిష్టం చేయాలని,పార్టీ ఇచ్చిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ ముందుండాలని,బలమైన బూత్‌లు బలమైన పార్టీని నిర్మిస్తాయని,కాబట్టి ప్రతి బూత్ కమిటీ సమగ్ర ఓటరు జాబితా,నిరంతర ప్రచారం, పోలింగ్ రోజుకు పూర్తి స్థాయి సంసిద్ధతను కలిగి ఉండాలని, సమన్వయం అత్యంత కీలకం. కార్యకలాపాలు,జిల్లా వ్యూహాన్ని సమర్థవంతంగా అనుసంధానించాలని,శక్తి కేంద్రాల ఇన్చార్జీలు చురుకైన పర్యవేక్షణ,మద్దతు ద్వారా బూత్‌లను బలోపేతం చేయాలని,ప్రతి స్థాయిలో సంస్థాగత ప్రణాళికలను క్రమశిక్షణతో అమలు చేయడం ఎన్నికల విజయాన్ని, రాజకీయ బలాన్ని నిర్ణయిస్తుందని,కార్యకర్తల అంకిత భావమే పార్టీ విజయాలకు మూలాధారం. ప్రతి వార్డు – ప్రతి బూత్‌లో బలమైన నిర్మాణం అవసరమని,ప్రధాని నరేంద్ర మోదీ మార్గదర్శకత్వంలో వికసిత భారత్ లక్ష్యంగా, తెలంగాణలో బిజెపి శక్తివంతమైన ప్రత్యామ్నాయంగా ఎదగడానికి కృషి చేయాలని సూచించారు.బీజేపీ కేంద్ర ప్రభుత్వం అమలవుతున్న అభివృద్ధి,సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని,స్థానిక సమస్యలపై దృష్టి సారించి ప్రజల పక్షాన నిరంతరం పనిచేయాలని జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ దిశా నిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా బూత్ నిర్మాణ అభియాన్ జిల్లా కో కన్వీనర్లు గడల కుమార్, గుడిపూడి రాధాకృష్ణ,బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్ షా,జిల్లా ప్రధాన కార్యదర్శిలు బాకం హరిశంకర్,బన్న ప్రభాకర్, గోగుల రాణా ప్రతాప్ రెడ్డి, మండల అధ్యక్షులు, మండల,డివిజన్ కన్వీనర్లు పాల్గొన్నారు.



# మండల యాదగిరికి రాష్ట్రస్థాయి పురస్కారం

- సర్వోత్తమ సేవ పురస్కారం అందుకున్న సీనియర్ జర్నలిస్ట్

**హుజురాబాద్, తెలంగాణ చౌరస్తా :**

కరీంనగర్ జిల్లా హుజురాబాద్ పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ మండల యాదగిరి గత 30 సంవత్సరాలుగా పత్రికా రంగంలో విశిష్ట సేవలు గుర్తించి వారికి రాష్ట్రస్థాయి సర్వోత్తమ సేవ పురస్కారం ప్రదానం చేశారు. మానవ విలువల పరిరక్షణ సేవా సంస్థ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు ప్రజాకవి నాగుల సత్యం గౌడ్ ఈ అవార్డుకు ఎంపిక చేయగా ఈ యొక్క అవార్డును హైదరాబాదులోని రవీంద్ర భారతి మెయిన్ హాల్లో పలు సంస్థల వ్యవస్థాపకులు ,ఇంటర్నేషనల్ గ్లోబల్ ఈవెంట్ ,అంతర్జాతీయ భారత్ వరల్డ్ రికార్డ్ గ్రహీత కదరి వెంకటరమణ రావు,ఈ కార్యక్రమానికి వచ్చిన ముఖ్య అతిథి పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ తెలంగాణ స్టేట్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా,డాక్టర్ శివ నాగార్జున రెడ్డి,ఫిలిం ఆర్టిస్టు ఐశ్వర్య, డాక్టర్ పి .ఝాన్సీ రామ్ లు శాలువా కప్పి,సర్వోత్తమ సేవా పురస్కారం అవార్డును ప్రధానం చేసి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఈ కార్యక్రమ నిర్వాహకులు, ఈ కార్యక్రమంకు వచ్చిన ముఖ్య అతిథి కోలేటి దామోదర్ గుప్తా, దైవజ్ఞ శర్మ, డాక్టర్ శివ నాగార్జున రెడ్డిలు మాట్లాడుతూ....గత 30 సంవత్సరాలుగా మండల యాదగిరి పత్రికా రంగంలో అందిస్తున్న నిస్వార్ధ,సామాజిక సేవలు వెలకట్టలేనివన్నారు. వృత్తి పరంగా ఎన్నో ఆటుపోటులను ఎదుర్కొని సమాజ శ్రేయస్సే లక్ష్యంగా 30 ఏళ్లుగా ఇలాంటి స్వార్థాన్ని ఆశించకుండా నిస్వార్థంగా సేవా దృక్పథాన్నే పరమార్థంగా భావించి తమ వంతు పాత్ర సమర్థవంతంగా పోషించి సమాజ సేవలో భాగస్వాములై ఆదర్శప్రాయంగా నిలుస్తున్నందుకు ఆయనను రాష్ట్ర స్థాయి అవార్డుతో సత్కరించడం గర్వంగా ఉందన్నారు.మానవతా విలువలు పెంపొందించే దిశగా అహర్నిశలు కృషి చేయాలని నిరంతర సేవా తత్పరులుగా మారాలని ఆకాంక్షించారు.యాదగిరి ఇలాగే జర్నలిస్టుగా మరిన్ని ఏళ్లపాటు సేవలందించి ప్రజలు ప్రభుత్వం చే గుర్తింపు పొంది మరెన్నో అవార్డులు, రివార్డులు,సత్కారాలు పొందాలని ఆకాంక్షించారు.పత్రికా రంగంలో పాతికేళ్లకు పైగా సేవ చేసే ప్రతి జర్నలిస్టుకు ప్రభుత్వం జీవనోపాధి,ఆర్థిక సహాయం కల్పించాలని ఈ సందర్భంగా అతిథులు సూచనలు చేశారు.



# 'ప్రజావాణి' దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలి

- అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే

**కరీంనగర్, తెలంగాణ చౌరస్తా :**

ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యమిచ్చి వెను వెంటనే పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి నిర్వహించగా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే ఆర్డీవోలు మహేశ్వర్,రమేష్ బాబుతో కలిసి దరఖాస్తులు స్వీకరించారు.కొన్ని దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించారు.మొత్తం 249 దరఖాస్తులు వచ్చాయి.ఇందులో అత్యధికంగా కరీంనగర్ నగర పాలికకు 42, హౌసింగ్ శాఖకు



సంబంధించి 43 దరఖాస్తులు వచ్చాయి.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్టీ కళాశాల బాయ్స్ హాస్టల్‌ను ప్రారంభించండి

- ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కలెక్టర్ కి వినతి

**వరంగల్, తెలంగాణ చౌరస్తా :**

ఐక్య విద్యార్థి సంఘాలు ఏఐఎస్ఎఫ్,ఏఐఎఫ్ డిఎస్,ఏ బిఎస్ఎఫ్ సంఘాల ఆధ్వర్యంలో గ్రీవెన్స్ లోని కలెక్టర్ కి వినతిపత్రం అందజేశారు.అనంతరం ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ల్యాదల్ల శరత్,ఏ ఐ ఎఫ్ డి ఎస్ జిల్లా కార్యదర్శి చుక్క ప్రశాంత్,ఏ బి ఎస్ ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొట్ల నరేష్ లు మాట్లాడుతూ... వరంగల్ జిల్లాలోని సంగెం మండలంలో ఉన్నటువంటి ఎస్టీ గిరిజన వసతి గృహం కళాశాల హాస్టల్లో విద్యార్థులు లేరనేపంతో మూసివేసి అక్కడి నుండి బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల వద్ద హాస్టల్ నిర్మించాలని అధికారులు ఆదేశించినప్పటికీ సంవత్సరాలు గడుస్తున్న కొద్దీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తనట్టుగా వ్యవహరిస్తున్నారని,కానీ హాస్టల్ ను ప్రారంభించడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారన్నారు.అదేవిధంగా బుల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల వద్ద వేలాది మంది



విద్యార్థులు సుదూర ప్రాంతాల నుండి వచ్చి వివిధ రకాల విద్యను అభ్యసిస్తు రూములలో ఉంటూ కిరాయిలు కట్టుకోలేని పరిస్థితి ఉందన్నారు.విద్యార్థులకు అందుబాటులో ఉండే విధంగా ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనారిటీ విద్యార్థులకు కనీసం వసతి గృహాలను నిర్మించాలన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు జిల్లా కలెక్టర్ స్పందించి తక్షణమే హాస్టల్ నిర్మాణానికి పోనుకోవాలన్నారు.లేనియెడల ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామన్నారు.





# మా 'మధన్న' మంచిగుండాలే..

## గ్రాండుగా 'గూడెం మధు' బర్త్ డే సెలబ్రేషన్స్

- దస్తగీర్(చోటు) ఆధ్వర్యంలో కార్యక్రమం
- పటాన్ చెరు బస్ స్టేషన్ ముందు అన్నదానం, కేక్ కటింగ్
- పాల్గొన్న మధుసూదన్ రెడ్డి తనయుడు సందీప్ రెడ్డి

**పటాన్ చెరు, తెలంగాణ చౌరస్తా :**

కార్యకర్తలకు నిరంతరం తోడుంటూ.. పేదలకు అనునిత్యం అండగా నిలుస్తూ.. ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ..ఆపద్బాంధవుడిగా, మనసున్న మారాజుగా పేరు తెచ్చుకున్న పటాన్ చెరు ఎమ్మెల్యే సోదరుడు, సీనియర్ నాయకుడు గూడెం మధుసూదన్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి..తెలంగాణ రాష్ట్ర ఆటో యూనియన్ జేఏసీ ఉపాధ్యక్షులు షేఖ్ దస్తగీర్(చోటు) ఆధ్వర్యంలో గూడెం మధుసూదన్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పటాన్ చెరు జీఎంఆర్ ప్రిన్స్ ఆటో యూనియన్ సభ్యులతో కలిసి గూడెం మధుసూదన్ రెడ్డి బర్త్ డే సెలబ్రేషన్స్ హ్యాపీగా.. గ్రాండుగా జరుపుకున్నారు. పటాన్ చెరు బస్ స్టేషన్ ఎదురుగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేక్ కటింగ్ తో పాటు 500 మందికి అన్నదానం ఏర్పాటు చేశారు. గూడెం మధుసూదన్ రెడ్డి తన పుట్టిన రోజు సందర్భంగా వెంకటేశ్వర స్వామి వారి దర్శనం నిమిత్తం తిరుపతి వెళ్ళారు..మధుసూదన్ రెడ్డి తనయుడు, యువ నాయకుడు గూడెం సందీప్ రెడ్డి కార్యక్రమానికి హాజరై..కేక్ కట్ చేశారు. అనంతరం అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు.

**గూడెం మధన్న అందరివాడు..ఆపద్బాంధవుడు**
**- ఆటో యూనియన్ నేత షేఖ్ దస్తగీర్(చోటు)**

గూడెం మధుసూదన్ రెడ్డి అందరివాడని, ఆపద్బాంధవుడు..మనసున్న మహారాజు అని తెలంగాణ రాష్ట్ర ఆటో యూనియన్ జేఏసీ ఉపాధ్యక్షుడు షేఖ్ దస్తగీర్ (చోటు భాయ్) అన్నారు. ఆటో డ్రైవర్లకు ఎల్లవేళల అండగా ఉంటూ అర్ధరాత్రి పిలిస్తే పలుకుతూ.. ఆపదలో ముందుండి సాయంగా నిలుస్తున్నారని చెప్పారు. తాను తెలంగాణ రాష్ట్ర ఆటో యూనియన్ జేఏసీ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత అనేక నియోజకవర్గాలు పర్యటించానని, అక్కడ ఆటో డ్రైవర్లకు ఎన్నో సమస్యలు



ఉన్నా వారికి సరైన నాయకుడు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కానీ మాకు గూడెం మహిపాల్ రెడ్డి, గూడెం మధుసూదన్ రెడ్డి లాంటి డైనమిక్ నాయకులు కొండంత అండగా ఉండి ఆటో డ్రైవర్ల బతుకులు సజావుగా సాగడానికి తోడ్పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మనీష్




గౌడ్, ఇమ్రాన్, ఇమామ్ భాయ్, దత్తు, ఇర్ఫాన్, మల్లేష్, ఖాదర్, సాదిక్, జార్జ్, నరసింహ, అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

### తిరుమల శ్రీవారిని దర్శించుకున్న గూడెం మధుసూదన్ రెడ్డి..

**– శుభాకాంక్షలు తెలిపిన వారందరికీ కృతజ్ఞతలు**

**తన జన్మదినం పురస్కరించుకొని సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి సోమవారం తెల్లవారుజామున తిరుమలలోని కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తిరుమల వెంకన్న ఆశీస్సులతో పటాన్ చెరు నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. తనకు ప్రత్యక్షంగా, పరోక్షంగా, వివిధ మాధ్యమాల ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, శ్రీధర్ చారి, అశోక్, జనార్దన్ రెడ్డి, హరి, తదితరులు పాల్గొన్నారు.**





# స్మార్ట్ ఫోన్ కాదు...స్మార్ట్ మనస్సును తయారు చేసుకోండి

- వైఫై కాదు... విల్ పవర్ పెంచుకోండి
- మీలోని బలహీనతలను విడిచిపెట్టడండి
- స్వామి వివేకానందుడి స్ఫూర్తితో దేశం కోసం పనిచేయండి
- జాతీయ యువజన దినోత్సవంలో కేంద్రమంత్రి బండి సంజయ్

**కరీంనగర్, తెలంగాణ చౌరస్తా :**






"మీరంతా "స్మార్ట్ ఫోన్ కే పరిమితం కావొద్దు. స్మార్ట్ మనస్సును తయారు చేసుకోండి!" "వైఫై కాదు... విల్ పవర్ పెంచుకోండి ! ప్రశ్నించే ధైర్యాన్ని నింపుకోండి...అన్యాయం జరిగితే ఎదిరించే శక్తి పెంచుకోండి.మీ కోసం,మీ కుటుంబం కోసం కాకుండా దేశం కోసం పనిచేయాలి''అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ యువతకు పిలుపునిచ్చారు.భారత దేశ ఖ్యాతిని ఖండాంతారాలు దాటించడమే కాకుండా భారతీయ సమాజాన్ని జాగృతం చేసిన మహనీయుడు స్వామి వివేకానంద అని,నిరాశలో ఉన్న యువతను తట్టి లేపేందుకు ఆయన చెప్పే మాటలు యువతకు తారక మంత్రంగా పనిచేస్తాయన్నారు.స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని మేరా యువ భారత్ ఆధ్వర్యంలో కరీంనగర్ లోని కళాభారతిలో జాతీయ యువజన దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.బండి సంజయ్ తోపాటు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి,జిల్లా యువజన అధికారి రాంబాబు,జిల్లా స్పోర్ట్స్ అధికారి శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొనగా,ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ చేతుల మీదుగా పలువురికి 'స్పోర్ట్స్ కిట్స్' అందజేశారు.అనంతరం బండి సంజయ్ మాట్లాడుతూ....భారత దేశ ఖ్యాతిని ఖండాంతారాలు దాటించిన వ్యక్తి,భారతీయ సమాజాన్ని జాగృతం చెయ్యడమే కాకుండా యోగ,వేదాంత శాస్త్రాలను ప్రపంచ వ్యాప్తం చేసిన మహనీయుడు స్వామి వివేకానంద అని ,నిరాశలో ఉన్న యువతను తట్టి లేపేందుకు ఆయన చెప్పే మాటలు మనకు ఎప్పటికీ తారక మంత్రంగా పనిచేస్తాయన్నారు.''నీ వెనుకాల ఏముంది.. ముందేముంది అనేది నీకు అనవసరం.నీలో ఏముంది అనేది ముఖ్యం.మందలో ఒకరిగా ఉండొద్దు.వందలో ఒకరిగా ఉండడానికి ప్రయత్నించండి.'' అంటూ స్వామి వివేకాంద చెప్పిన మాటలు యువతలో ప్రత్యేకతను వెలికి తీసేందుకు పనికొస్తాయన్నారు.''ఇనుప కండరాలు,ఉక్కు నరాలు,వజ్ర సంకల్పమున్న యువతను 100 మందిని ఇవ్వండి.ఈ దేశ తలరాతనే మార్చేస్తానంటూ స్వామి వివేకానంద చెప్పిన మాటలను చూస్తే...భారతీయ యువత శక్తిసామర్థ్యాల మీద ఆయనకు ఎంత గట్టి నమ్మకం ఉందో అర్థం చేసుకోవాలన్నారు. కానీ ఈ రోజు యువత పరిస్థితి బాధాకరం... చేతిలో మొబైల్, ఇంటర్నేట్,ఆన్ లైన్ గేమ్స్... మద్యం,డ్రగ్స్ కు బానిసలవుతున్నారని,విదేశాలన్నీ భారత్ ను ఫాలో అవుతుంటే...మనం మాత్రం మోడరన్ కల్చర్ పేరుతో విదేశీ కల్చర్ ను అలవాటు చేసుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు."ఈ దేశానికి బలహీనులు కాదుబలవంతులు కావాలి!" చరిత్ర స్రుష్టించే వారిగా మారండి.తల్లి భారతమాత అత్యున్నతమైన సింహాసనం మీద కూర్చుని ఉన్న ద్రుశ్యాన్ని నేను ప్రత్యక్షంగా చూశానని 1897 లోనే స్వామి వివేకానంద చెప్పారంటే ఆయనలో ఎంతటి అద్భుతమైన విజన్ ఉందో అర్థం చేసుకోవచ్చునని,స్వామిజీ కన్న కలలను నేడు "వికసిత్ భారత్2047'' విజన్ డాక్యుమెంట్ రూపంలో భారత్ ను విశ్వగురు స్థానంలో నిలబెట్టేందుకు ప్రధాని మోదీజీ అహర్నిశలు క్రుషి చేస్తున్నారన్నారు.ఆర్థిక ప్రగతిలో 11వ స్థానంలో ఉన్న భారత్ ను 4వ స్థానంలో నిలిపారని,25 కోట్ల మందిని పేదరికం నుండి గట్టెక్కించారన్నారు.యువత అభివృద్ధి,సంక్షేమం,క్రీడల కోసం మోదీజీ ప్రత్యేకంగా ద్రుష్టి పెట్టారని,యూపీఏ పాలనలో క్రీడా బడ్జెట్ 1640 కోట్లు మాత్రమే...మోదీ పాలనలో నేడు క్రీడల కోసం 3,794 కోట్ల రూపాయలు కేటాయించారని,మోదీ ప్రత్యేక ద్రుష్టి పెట్టడంవల్లే ఒలింపిక్స్,కామన్ వెల్త్, ఏసియన్ గేమ్స్ లో అనేక పతకాలను సాధించగలిగామని,ఉద్యోగాల విషయానికొస్తే....ఒక్క ఏడాదిలోనే 10 లక్షల మందికి అవినీతి,పైరవీలకు ఆస్కారం లేకుండా మెరిట్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించారని,స్టార్టప్ ఇండియా స్టాండప్ ఇండియా పేరుతో యువతను పారిశ్రామికవేత్తలుగా,వ్యాపారవేత్తలుగా,ఐటీ యజమానులుగా తీర్చిదిద్దుతున్నారని,గత 10 ఏళ్లలో స్టార్టప్ ఇండియా ద్వారా 1 లక్షా 59 వేల 157 మంది సొంతంగా స్టార్టప్ లు స్థాపిస్తామని కేంద్రం వద్ద దరఖాస్తు చేసుకోవడమే కాకుండా ఇప్పటి వరకు 10 లక్షల మందికిపైగా ప్రత్యక్షంగా ఉద్యోగాలు కల్పించారని,ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన ద్వారా గత పదేళ్లలో 1 కోటి 70 లక్షల మందికి స్కిల్ డెవలెప్ మెంట్ కోర్సుల్లో శిక్షణనందించారని,ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించారని,స్వామి వివేకానంద జయంతి సందర్భంగా చదువులోనే కాదు క్రీడల్లోనూ సత్తా చాటేందుకు ప్రయత్నించాలని, భవిష్యత్తుపై ఒక లక్ష్యాన్ని ఎంచుకోని పనిచేయాలని,దేశం కోసం నిలబడాలని,ధర్మం కోసం పనిచేయాలని,అన్యాయాన్ని ఎదురించాలని,దేశాన్ని పట్టిపీడిస్తున్న డ్రగ్స్,మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు.డ్రగ్స్ పెడ్లర్స్ సమాచారం తెలిస్తే ప్రభుత్వానికి సమాచారమివ్వండి.దయచేసి మీలోని బలహీనతలను విడిచిపెట్టడండి. భయాన్ని మనసులోకి రానీయకండి.భారతీయుడిగా గర్వంగా నిలబడండి...అదే స్వామి వివేకానందుడికి మనం అందించే ఘనమైన నివాళి అని తెలిపారు.

# ఉద్యోగులకు కరువు భత్యాన్ని పెంచడాన్ని స్వాగతిస్తున్నాం

- తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ (టీఎన్జీవో)
- కేంద్ర సంఘం అధ్యక్షులు మార్వం జగదీశ్వర్,ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం. హుస్సేనీ (ముజీబ్)




హైదరాబాద్, తెలంగాణ చౌరస్తా:

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల కరువు భత్యాన్ని 30.03 శాతం నుండి 33.67 శాతానికి పెంచుతూ తీసుకున్న నిర్ణయాన్ని తెలంగాణ నాన్‌గెజిటెడ్ అధికారుల (టీఎన్జీవో) కేంద్ర సంఘం, హైదరాబాద్ జిల్లా యూనియన్ నాయకులు స్వాగతించారు. ఈ సందర్భంగా టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షులు మారం జగదీశ్వర్ సందేశాన్ని ఇస్తూ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, వివిధ సవాళ్లు ఉన్నప్పటికీ, ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా డీఏ పెంపును ప్రకటించిన ముఖ్యమంత్రి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ పెంపు ఉద్యోగుల ఆర్థిక భద్రతకు దోహదపడుతుందని అన్నారు.ప్రభుత్వంతో నిరంతరం జరిపిన చర్చల ఫలితంగానే ఈ విజయం సాధ్యమైందని, రాబోయే రోజుల్లో కూడా ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం తమ సంఘం అలుపెరగని పోరాటం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం. హుస్సేనీ (ముజీబ్) గ మాట్లాడుతూ.. త్వరలోనే ముఖ్యమంత్రి తో జరగబోయే అధికారిక సమావేశంలో ఉద్యోగుల ఇతర గ్రీవెన్స్‌లు, పెండింగ్ సమస్యలన్నీ పరిష్కారమవుతాయని ధీమా వ్యక్తం చేశారు. టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎస్. విక్రమ్ కుమార్,జిల్లా కార్యదర్శి కూడా ఈ డీఏ పెంపు పట్ల తమ సంతోషాన్ని ప్రకటిస్తూ, క్షేత్రస్థాయిలో ఉద్యోగులందరికీ ఇది ఎంతో ఊరటనిచ్చే విషయమని కొనియాడారు.

# మహిళ ఐఏఎస్‌లపై అసత్య ప్రచారం ఆపాలి

- తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ (టీఎన్జీవోస్)



హైదరాబాద్ ,తెలంగాణ చౌరస్తా:

తెలంగాణ రాష్ట్రంలో మహిళా ఐఏఎస్ అధికారులను, ముఖ్యంగా హైదరాబాద్ కలెక్టర్ గారిని లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారాలను నిరసిస్తూ, టీఎన్జీవోస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు విక్రమ్ కుమార్, కార్యదర్శి కుర్రాడి శ్రీనివాస్ నాయకత్వంలో కలెక్టరేట్ ఆవరణలో నిరసన ప్రదర్శన అనంతరం విక్రమ్ కుమార్ ,కుర్రాడి శ్రీనివాస్ ల నేతృత్వంలోని ప్రతినిధి బృందం అదనపు కలెక్టర్ ఖాదిరవన్ పళని వినతిపత్రం అందజేశారు.టీఎన్జీవోస్ కేంద్ర సంఘం అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం. హుస్సేనీ (ముజీబ్) ల పిలుపు మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు విక్రమ్ కుమార్ మాట్లాడుతూ.. గతంలో వికారాబాద్ జిల్లాలో ప్రతీక్ జైన్ ఐఏఎస్ పై జరిగిన భౌతిక దాడిని మరువక ముందే, ఇప్పుడు మహిళా అధికారులపై ఈ రకమైన డిజిటల్ దాడులు జరగడం అత్యంత హేయమైన చర్య అని మండిపడ్డారు. ఈ విషయంలో రాష్ట్ర డీజీపీ వెంటనే సుమోటోగా స్పందించి కేసులు నమోదు చేయాలని, అధికారుల మనోస్థైర్యాన్ని దెబ్బతీస్తున్న వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అనంతరం జిల్లా కార్యదర్శి కుర్రాడి శ్రీనివాస్ మాట్లాడుతూ.. అధికారులు నిరంతరం ప్రజల కోసం శ్రమిస్తుంటే, కేవలం వ్యూస్ కోసం వారి వ్యక్తిగత జీవితాలను కించపరిచేలా వార్తలు ప్రసారం చేయడం దుర్మార్గమని, టీఎన్జీవోస్ యూనిట్ ఎల్లప్పుడూ జిల్లా పరిపాలనా యంత్రాంగానికి వెన్నంటే ఉంటుందని స్పష్టం చేశారు. కేంద్ర ప్రచార కార్యదర్శి శైలజ , ఐటీఐ శ్రీదేవి మాట్లాడుతూ.. మహిళలను గౌరవించే దేశంలో మహిళా అధికారులపై ఇటువంటి దాడులు సరికాదని, ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కె.ఆర్.రాజ్ కుమార్,ఖాదర్ బిన్ హసన్, ఖాలెద్ అహ్మద్, వైదిక శ్రేష్ట, ఏ.వి. శ్రీధర్, టి.రాజు, సత్యనారాయణ, దుర్గ ఫణి, కె. వాసు, జోయల్, మురహరి, జయంతి, రజని, సాహితి, అమీన్ ఫాతిమా, కల్పన, స్వాతి తదితరులు పాల్గొన్నారు.



# సర్పంచ్‌లను సన్మానించిన మేకల మార్కెట్ నాయకులు

రామగిరి,తెలంగాణ చౌరస్తా:

సెంటినరీ కాలనీలోని మేకల మార్కెట్ లో ఇటీవల ఎన్నికైన స్థానిక రత్నాపూర్ సర్పంచ్ పల్లె.ప్రతిమ పీవీరావు,పన్నూరు సర్పంచ్ చిందం మహేష్ లను సోమవారం మేకల మార్కెట్ నాయకులు ఘనంగా సన్మానించారు.మైసమ్మ దేవాలయంలో పూజరి శ్రీనివాసచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ లను శాల్వాలతో సత్కరించి బొకే అందించారు.ఈ కార్యక్రమంలో శ్రీరామాంజనేయ మేకల మార్కెట్ అసోసియేషన్ అధ్యక్షులు ఒర్రె సురేష్,ఒర్రె సదయ్య, అల్వాల వెంకన్న,అల్వాల తిరుపతి, బత్తిని ఐలయ్య, బనుక అంజి, ఎండీ గఫూర్ తదితరులు పాల్గొన్నారు.



# నూతన సర్పంచ్,ఉపసర్పంచ్‌లను సత్కరించిన వివోఏలు

కమాన్‌పూర్,తెలంగాణ చౌరస్తా:

కమాన్‌పూర్‌లో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్, ఉపసర్పంచ్ రఫిక్ సోహెల్ లను విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు (వివోఏ) శాలువలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో మేఘమాల,శైలజ,సుమలత,సంధ్య,సరిత,భాగ్య,స్వప్న,శ్రీహర్షిత పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

# పేకాట,కోడిపందాలపై పటిష్ట నిఘా

- అసాంఘిక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు
- పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ



రామగుండం,తెలంగాణ చౌరస్తా:

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి,మంచిర్యాల జోన్‌లలో ఉన్న అన్ని పోలీస్ స్టేషన్ పరిధుల్లో పేకాట,కోడిపందాలు, ఇతర చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు కమిషనరేట్ వ్యాప్తంగా ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఆకస్మిక వాహన తనిఖీలు, నాకాబందీలు నిర్వహించడంతో పాటు జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో గుర్తించిన కీలక ప్రదేశాలలో సమాచార వ్యవస్థను మరింత బలోపేతం చేసినట్లు తెలిపారు. అదేవిధంగా కమిషనరేట్ సరిహద్దు జిల్లాలు, ఇతర రాష్ట్రాల్లోని పోలీస్ స్టేషన్‌లతో సమన్వయం ఏర్పాటుచేసి సంయుక్తంగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. పేకాట, కోడిపందాలు లేదా ఇతర అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించి ఎలాంటి సమాచారం తెలిసినా వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100కు సమాచారం అందించాలని ప్రజలను ఆయన కోరారు.సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు.



# కమాన్‌పూర్ లో సీఎం కప్ టార్చ్ లైట్ ర్యాలీ

కమాన్ పూర్,తెలంగాణ చౌరస్తా:

కమాన్‌పూర్ మండలంలోసీఎం కప్-2025-26 క్రీడా వేడుకలకు ఘనంగా శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా నిర్వహించిన టార్చ్ లైట్ ర్యాలీతో క్రీడా పోటీలకు అధికారికంగా ఆహ్వానం పలికారు. జనవరి 17 నుంచి 22 వరకు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్, యోగా విభాగాల్లో ఉత్సాహంగా పోటీలు జరగనున్నాయి.ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రియాంక మాట్లాడుతూ ఈ పోటీల్లో పాల్గొనాలనుకునే క్రీడాకారులు సీఎం కప్ అధికారిక వెబ్‌సైట్, మీ సేవ కేంద్రాలు లేదా ఆన్‌లైన్ సెంటర్ల ద్వారా తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఫోటో, ఆధార్ కార్డు, వయస్సు ధృవపత్రం అప్లోడ్ చేయడం తప్పనిసరి అని తెలిపారు. రిజిస్ట్రేషన్ లేకుండా పోటీల్లో పాల్గొనే అవకాశం లేదని స్పష్టం చేశారు. ఈ టార్చ్ ర్యాలీలో జిల్లా యువజన, క్రీడల అధికారి ఏ. సురేష్, పీఈటీ సంఘాల ప్రతినిధులు వి. సురేందర్, దాసరి రమేష్, షఫియుద్దీన్, బి. వాసు, బి. సత్యనారాయణ తో పాటు ప్రణయ్ కుమార్, ఎన్. శ్రీనివాస్, శివ, మధుకర్, పీడీలు, పీఈటీలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ క్రీడా సంబరం యువతలో ప్రతిభను వెలికి తీయనుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.




# రక్తదానం ప్రాణదానంతో సమానం

కొత్తపల్లి,తెలంగాణ చౌరస్తా:

నారాయణపేట జిల్లా,కొత్తపల్లి మండలం నిడ్జింత గ్రామంలో స్వామి వివేకానంద 163వ జయంతి సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.మద్దూరు ఎస్సై విజయ్ కుమార్,సర్పంచ్ రజిత శ్రీనివాస్ లు మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని,అత్యవసర పరిస్థితుల్లో దాతలు ఇచ్చే రక్తం ప్రాణాలను నిలబెడుతుందని అన్నారు.ఇందులో భాగంగా మొదటగా శివ స్వాములు రక్తదానం చేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుజాత అంజిలయ్య,మాజీ సర్పంచ్ రాజశేఖర్,కె. శ్రీనివాస్,ఇ.వెంకట్రాం,విజయ్ కుమార్,నగేష్,పవన్ కుమార్,బాలరాజు,వెంకట్రాములు,రఫీ,తిరుపతి, శేఖర్,నవాబ్ తదితరులు పాల్గొన్నారు



# హిందూ వాహిని ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు

రామగుండం,తెలంగాణ చౌరస్తా:

స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని హిందూ వాహిని ఆధ్వర్యంలో 163వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అన్నపూర్ణ కాలనీ నుండి మేడిపల్లి సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించబడింది. యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా, స్వామి వివేకానంద ఆశయాలు, ఆదర్శ మార్గంలో నడవాలని పిలుపునిస్తూ ఈ ర్యాలీ కొనసాగింది. ర్యాలీ అనంతరం స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించడం జరిగింది. అనంతరం ప్రజలకు పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి రామగుండం ఇంచార్జ్ కందుల సంధ్యారాణి పాల్గొని, యువత దేశ భవిష్యత్తు అని, వివేకానందుని ఆలోచనలు యువత జీవితానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. సమాజంలో మంచి మార్పు రావాలంటే యువత సక్రమ మార్గంలో నడవాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హిందూ వాహిని స్టేట్ ప్రెసిడెంట్ కాంతాల సంతోష్, మంతిని శివ, జిల్లా వైస్ ప్రెసిడెంట్ గోలివాడ శ్రీకాంత్, కార్యకర్తలు చందనగిరి శివ,ఈదునూరి వెంకటేష్,అరెందల రవీందర్,మీసాల సాయి, వర్షిత్,కుమ్మరి సురేష్,మహేష్, బిజెపి నాయకులు సోమారపు అరుణ్ లావణ్య,మిట్టపల్లి సతీష్ కుమార్, సిలివేరి అంజి, ఈదునూరి చిరంజీవి,లంక వినోద్,ఈదునూరి శ్రీకాంత్,మిట్టపెల్లి రవి ,ఆడ్లూరి నవీన్,బాధవత్ రాహుల్,కుమార్, ఈదునూరి, శ్రీకాంత్,హరికృష్ణ,రేగొండ సంతోష్,గాండ్ల శివకుమార్,పల్లికొండ శ్రీకాంత్, సంపత్, కేశవ్, మందపల్లి శ్రీకాంత్,తోట రవి ,పశుల సందీప్ ,యువకులు, స్థానిక ప్రజలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

# సనాతన ధర్మం గురించి ప్రపంచానికి చెప్పిన వ్యక్తి స్వామి వివేకానంద

- మొలుమూరి శ్రీనివాస్



రామగిరి, తెలంగాణ చౌరస్తా:

భారతదేశ గొప్పతనాన్ని సనాతన ధర్మం గురించి ప్రపంచానికి చెప్పిన వ్యక్తి స్వామి వివేకానంద అని బిజెపి ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మొలుమూరి శ్రీనివాస్ అన్నారు.ఈ సందర్భంగా రామగిరి మండలం సెంటనరీ కాలనీలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మొలుమూరి శ్రీనివాస్ మాట్లాడుతూ.... అమెరికా దేశంలో సర్వమత సమ్మేళనం జరిగినప్పుడు ప్రపంచ దేశాలన్నీ అందులో పాల్గొన్న ,భారతదేశం తరఫున శ్రీ స్వామి వివేకానంద సనాతన ధర్మం గురించి హిందూ సాంప్రదాయాల గురించి చెప్పి భారతదేశం గొప్పతనం విలువలు మన సాంప్రదాయ సంస్కృతి చెప్పి వారి మన్ననాలు పొంది ప్రపంచంలోనే భారతదేశం అఖండ దేశంగా వెలుగుతుందని ఆ యొక్క సమావేశంలో పాల్గొన్న వివిధ మతాల సభ్యులందరికీ వివరించడం జరిగిందనీ ,అప్పుడు అందరూ స్వామి వివేకానంద గురించి తెలుసుకొని ఆయన మాటలకు మంత్రముగ్ధులే హర్ష ధ్వానాలు చేశారని, వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కన్యకా పరమేశ్వరి వ్యవస్థాపకుడు దుంతుల సురేష్, తదితరులు పాల్గొన్నారు.




# వివేకానంద జీవితం యువతకు స్ఫూర్తిదాయకం

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- ఘనంగా స్వామి వివేకానంద జయంతి

పటాన్ చెరు, తెలంగాణ చౌరస్తా :

స్వామి వివేకానంద జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. స్వామి వివేకానంద 164వ జయంతినీ పురస్కరించుకొని గురువారం పటాన్ చెరు పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని.. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. స్వామి వివేకానంద తన ప్రసంగాల ద్వారా యువతలో స్ఫూర్తి నింపడంతో పాటు ప్రపంచవ్యాప్తంగా భారతదేశ గొప్పతనాన్ని చాటి చెప్పారని కొనియాడారు. ఆయన పుట్టిన రోజును దేశవ్యాప్తంగా జాతీయ యువజన దినోత్సవంగా నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, పట్టణ పుర ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.



# జూలపల్లిలో పారిశుద్ధ్య పనులు

కమాన్ పూర్,తెలంగాణ చౌరస్తా:

మండలంలోని జూలపల్లి గ్రామపంచాయతీ పరిధిలో 13 నుండి 17 వరకు నిర్వహించే ప్రత్యేక పారిశుద్ధ పనులలో భాగంగా సోమవారం లాంచానంగా గ్రామ పంచాయతీ పాలక వర్గం,పారిశుధ్య సిబ్బంది,పారిశుధ్య పనులకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో తడి చెత్త పొడి చెత్త ఇంటింటికి సేకరించారు. ఈ కార్యక్రమంలో జూలపల్లి గ్రామ సర్పంచ్ పోలుదాసరి వనిత సాయికుమార్,పంచాయతీ కార్యదర్శి అంబటి శంకర్, వార్డు సభ్యులు చొప్పరి లక్ష్మి ,వేముల సత్యనారాయణ, ఉద్దమారి పద్మా ,చిట్యాల రాయమల్లు,సాగర్ల రామ,సాగర్ల సౌజన్య,సొప్పరి సంతోష్ కుమార్, అంగన్వాడి టీచర్లు ,ఆశా కార్యకర్తలు, ప్రజలు, మహిళలు, గ్రామస్థాయి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు భూమి పట్టాలు


- ఎన్నికల హామీని నిలబెట్టుకున్న ఎమ్మెల్యే
- ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ కి ప్రత్యేక కృతజ్ఞతలు
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి. నాగయ్య






**రామగుండం, తెలంగాణ చౌరస్తా:**

సిపిఎం గోదావరిఖని పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి సిపిఎం కార్యాలయం వరకు ఇండ్ల పట్టాల విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.అనంతరం శ్రామిక భవన్ లో విజయోత్సవ సభ ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కామ్రేడ్ జి.నాగయ్య హాజరైనారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో నాలుగు సంవత్సరాల క్రితం ఇల్లు లేని నిరుపేదలందరిని సమీకరించి సిపిఎం ఆధ్వర్యంలో ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేయించడం జరిగిందని అన్నారు. రాష్ట్రంలో 21 జిల్లాల్లో లక్ష మంది గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారని అన్నారు. ఈ క్రమంలో పాములు,తేళ్లు, దోమలు దాడులు చేస్తున్న, కరెంటు లేకుండా, రోడ్ల సౌకర్యం లేకున్నా, నీళ్ల సౌకర్యం లేకున్నా ఓపికతో పేదలు వేసుకున్న గుడిసెల్లో నివసిస్తున్నారని అన్నారు. ఎందుకంటే పేదలు ఇంటి కిరాయిలు చెల్లించలేక, సరైన ఉపాధి లేకపోవడమే ప్రధాన కారణం అన్నారు. ఎన్నికల సందర్భంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ఇండ్ల లేని వారందరికీ 120 గజాల జాగ ఇచ్చి వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని హామీ ఇచ్చిందని అన్నారు. ఈ విషయంపై ఇప్పటికే సిపిఎం రాష్ట్ర నాయకత్వం ఆరుసార్లు ముఖ్యమంత్రిని కలవడం జరిగిందన్నారు. దానికి ముఖ్యమంత్రి సరే ఇస్తామనీ అన్నారనీ ,కానీ ఎక్కడ కూడా ఈ పని జరగలేదని అన్నారు. ప్రధానంగా రామగుండం నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకొని ఎన్నికల్లో తాను ఇచ్చిన వాగ్దానం ఏదైతే ఉందో నేను ఈ పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు కట్టించే బాధ్యత నాది అని చెప్పి వాగ్దానం చేశారని, ఇప్పుడు వారి వాగ్దానాన్ని అక్షరాల నిజం చేసుకున్నారని అన్నారు. అందులో భాగంగా నిన్న ఇచ్చిన 18 వందల పట్టాల్లో ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్న 300 మందికి పట్టాలు ఇచ్చారని, ఇందుకు ఎమ్మెల్యే కి రాష్ట్ర కమిటీ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేయడం జరిగిందనీ ,ఇప్పుడు పట్టాలిచ్చి పుణ్యం కట్టుకున్నారనీ ,అదేవిధంగా వీరందరికీ ఇందిరమ్మ ఇల్లు కట్టించి మౌలిక సదుపాయాలైన రోడ్లు, డ్రైనేజీ, మంచినీరు, కరెంటు తదితర సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నామని అన్నారు. అదేవిధంగా ఇంకా మరో 300 మంది ఇక్కడే ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకొని ఉన్నారని ,వారికి కూడా పట్టాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ని రాష్ట్రంలో ఉన్న అందరు ఎమ్మెల్యేలు అనుసరించి గుడిసెలు వేసుకున్న పేదలందరికి పట్టాలు ఇచ్చే లాగా కృషి చేయాలని అన్నారు.అదేవిదంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వై యాకయ్య మాట్లాడుతూ... సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించిన భూ పోరాటంలో అనేక మంది పేదలు వచ్చి గుడిసెలు వేసుకొని ఉన్నారని, ప్రభుత్వ అవసరాల నిమిత్తం పేదలు వేసుకున్న గుడిసె స్థలాలను ప్రభుత్వం తీసుకుని వారందరికీ తప్పకుండా పట్టాలు ఇస్తామని ఎమ్మెల్యే హామీ ఇవ్వడం జరిగిందని, ఈరోజు తన హామీని నిలబెట్టుకున్నారని, అందుకు సిపిఎం పార్టీ జిల్లా కమిటీ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నమని అన్నారు. అదేవిధంగా పట్టాలు రావడానికి కృషిచేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మహంకాళి స్వామి, బాలరాజులకు, సిపి అడ్మిన్ రాజు కి, ఏసిపి రమేష్ కి, సిఐ ఇంద్రసేనారెడ్డి కి , ఇండ్ల పట్టాలకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వేల్పుల కుమారస్వామి, సిపిఎం పట్టణ కార్యదర్శి ఏ మహేశ్వరి, నాయకులు మహేందర్ క్రాంతి,భాస్కర్,శివకుమార్, సతీష్,అనూష,దీప లతోపాటు అధిక సంఖ్యలో ఇండ్ల పట్టాలు వచ్చిన వారు పాల్గొన్నారు.



## భారతదేశ ఔన్నత్యాన్ని చాటిన వివేకానందుడు

- యువత వివేకానంద స్ఫూర్తితో ముందుకు సాగాలి
- కాంగ్రెస్ మెదక్ పార్లమెంట్ ఇంచార్జ్ నీలం మధు
- చిట్కుల్ లో ఘనంగా వివేకానంద జయంతి వేడుకలు

**పటాన్ చెరు, తెలంగాణ చౌరస్తా :**

దేశ జాతిని జాగృతం చేస్తూ, నేటి యువతే దేశ భవిష్యత్తుకు పునాది అని యువతలో స్ఫూర్తి నింపుతూ..మన దేశ ప్రతిష్టను విశ్వవ్యాప్తంగా ఇనుమడించేలా చేసిన విశ్వగురువు స్వామి వివేకానంద అని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ అన్నారు.స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని సోమవారం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలో చిట్కుల్ ఎన్.ఎం.ఆర్ క్యాంపు కార్యాలయంలో వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ రామకృష్ణ పరమహంసకు ప్రియ శిష్యుడైన వివేకానంద దేశంలో హిందూ మతం పునరుజ్జీవనంలో ప్రధాన పాత్ర పోషించారని తెలిపారు. పాశ్చాత్య ప్రపంచానికి భారతీయ వేదాంతం, ఆధ్యాత్మికత, యోగా, తత్వాలను పరిచయం చేయడంలో కీలకపాత్ర పోషించి మన దేశ గొప్పతనాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటి చెప్పారని కొనియాడారు. భారతదేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందన్న విశ్వాసాన్ని బలంగా నమ్మి ఆత్మవిశ్వాసం, ధైర్యం, కార్యదక్షత కలిగిన పౌరులుగా తయారు చేశారన్నారు. నేటి పోటీ ప్రపంచంలో చదువుతో పాటు వ్యక్తిత్వ వికాసం ఎంత ముఖ్యమో ఆయన ఆనాడే గుర్తించి యువతకి బోధనలు చేశారని అన్నారు, ఆ మహనీయుడి జన్మదినాన్ని దేశ యువజన దినోత్సవంగా జరుపుకుంటున్నామని, ఆయన స్ఫూర్తితో యువత ఒక లక్ష్యాన్ని ఎంచుకుని, క్రమశిక్షణతో, నిబద్ధతతో ముందుకు సాగితే విజయం తథ్యమని అభివర్ణించారు. ఆ మహనీయుడు అందించిన సందేశం నుంచి యువత స్ఫూర్తి పొంది తమ భవిష్యత్తుని బంగారుమయం చేసుకోవడంతో పాటు దేశ అభివృద్ధికి చేయూతనందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.






## పీజేఆర్ పేరు కాదు...బ్రాండ్

- మాజీ జడ్పీటీసీ గడిల శ్రీకాంత్ గౌడ్
- ఘనంగా పీజేఆర్ జయంతి..నివాళి



**పటాన్ చెరు, తెలంగాణ చౌరస్తా :**

పీజేఆర్ అంటే ఒక పేరు కాదు...బ్రాండ్ అని మాజీ జడ్పీటీసీ, బీఆర్ఎస్ నేత గడిల శ్రీకాంత్ గౌడ్ అన్నారు. పిజేఆర్ జయంతి సందర్భంగా ఇస్నాపూర్ మున్సిపల్, చిట్కుల్ గ్రామ పరిధిలోని జీటీఎన్ పరిశ్రమ వద్ద ఉన్న పీజేఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రతి క్షణం ప్రజల కోసం శ్రమించి, కార్మికులకు అండగా నిలిచిన మహా నేత పిజేఆర్ అని కొనియాడారు. పేద ప్రజల ప్రగతి కోసం బడుగు బలహీన వర్గాల ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన నాయకుడు అని అన్నారు. ఈ కార్యక్రమంలో జీటిఎన్ పరిశ్రమ యాజమాన్యం, మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, మాజీ ఎంపీటీసీ నరేందర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి, డప్పు ప్రశాంత్, దేగల నరేష్, బంద్రోళ్ల సంపత్, నవీన్, శ్రీరామ్, ట్రేడ్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**వివేకానందుడికి 'గడిల' ఘన నివాళి.**

స్వామి వివేకానంద జయంతి సందర్భంగా పటాన్ చిరు నియోజకవర్గం ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని చిట్కుల్ గ్రామంలో వివేకానంద యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని వివేకానందుడి విగ్రహానికి పూలమాల వేసి మాజీ జెడ్పీటీసి గడీల శ్రీకాంత్ గౌడ్ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ పటంపై భారత ఆధ్యాత్మిక కీర్తి పతాకాన్ని ఎగరవేయడంతో పాటు దేశ యువతలో వివేకానంద స్వామి ఎంతో స్ఫూర్తిని రగిలించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వివేకానంద యువజన సభ్యులు నవీన్, సంపత్, డప్పు ప్రశాంత్, దేగల నరేష్, మాజీ ఎంపీటీసీ నరేందర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ విష్ణు వర్ధన్ రెడ్డి, బ్యాగరి వెంకటేష్, అడ్వకేట్ నాగరాజు, గ్రామ యువకులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే సాబ్.. ఆలయ భూమిని కాపాడండి

- ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డికి పాటి గ్రామస్తులు వినతి
- సర్వే చేయించి..సొంత నిధులతో ఫెన్సింగ్ వేయిస్తా
- గ్రామస్తులకు ఎమ్మెల్యే జిఎంఆర్ భరోసా


**పటాన్ చెరు, తెలంగాణ చౌరస్తా :**

ముత్తంగి డివిజన్ పాటి గ్రామ పరిధిలో గల హనుమాన్ దేవాలయానికి సంబంధించిన దేవుడి మాన్యం భూమి కబ్జాకు గురవుతుందని..కబ్జాకోరుల నుండి భూమిని కాపాడాలని కోరుతూ గ్రామస్తులు సోమవారం పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డికి విన్నవించారు. గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 197 లో ఒక ఎకరా 33 గుంటలు హనుమాన్ దేవాలయం పేరుపై ఉందని..ఇటీవల కొందరు వ్యక్తులు ఆ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని వారు ఎమ్మెల్యే జిఎంఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ రికార్డులోనూ హనుమాన్ దేవాలయం పేరుపై ఉందని తెలిపారు. ప్రభుత్వ అధికారులతో సర్వే చేయించి భూమి రక్షణకు పాటుపడాలని వారు విన్నవించారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ప్రభుత్వ, దేవాదాయ భూములను కబ్జా చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని తెలిపారు.. అతి త్వరలో పూర్తి సర్వే నిర్వహించి భూమి రక్షణకు సొంత నిధులతో ఫెన్సింగ్ సైతం వేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ ప్రజా ప్రతినిధులు, అఖిలపక్ష బృందం సభ్యులు పాల్గొన్నారు.

## చిన్నారులు గాలిపటాలతో జాగ్రత్త

- సోషల్ సర్వీస్ కొత్తపల్లి నరేష్

**కొత్తపల్లి,తెలంగాణ చౌరస్తా:**



సంక్రాంతి పండుగను పురస్కరించుకొని యువకులు, విద్యార్థులు,చిన్నారులు గాలిపటాలను ఎగురవేస్తున్న క్రమంలో జాగ్రత్తలు పాటించాలని సోషల్ సర్వీస్ కొత్తపల్లి నరేష్ సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలిపటాలను భవనాలపై,విద్యుత్ వైర్ల క్రింద ఎగురవెయ్యకూడదని, అలాగే పరిగెత్తుతూ గాలిపటాలను తీయడానికి వెళ్లి ప్రమాదాలు కొని తెచ్చుకోకూడదన్నారు.విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ సమీపంలో జాగ్రత్త వహించాలన్నారు.ముఖ్యంగా చిన్నారులు తెగిపోయిన గాలిపటాల వెనకాల పరిగెత్తకూడదని విజ్ఞప్తి చేశారు.



## పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

- సర్పంచ్ దున్న శ్రీనివాస్

**తెలంగాణ చౌరస్తా,నడిగూడెం:**

గ్రామంలో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి పెడతామని నడిగూడెం గ్రామ సర్పంచ్ దున్నా శ్రీనివాస్ తెలిపారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఈనెల 12 నుండి 17వ తేదీ వరకు గ్రామాల్లో చేపట్టిన శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ ప్రోగ్రాంలో భాగంగా సోమవారం గ్రామంలో పారిశుద్ధ్య పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిల సహకారంతో గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడం తోపాటు పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి పెడతామని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యలక ఉమారాణి, ఉప సర్పంచ్ ఎలుగూరి నాగరాజు,వార్డు సభ్యులు దున్నా శ్రీకాంత్,దున్న లింగయ్య,దున్న మనీషా ప్రదీప్,పోలేబోయిన విజయ నాగరాజ్,మామిడి రామకృష్ణ, నాగవరపు సరస్వతి రాము, కాసాని శైలజసతీష్, గుండు మహేంద్ర ప్రసాద్,కాసాని మాదవి గోపినాథ్,షేక్ నాజియా రియాజ్,కాంగ్రెస్ పార్టీ నాయకులు కాసాని శివ లింగం,గుండు విజయరామారావు,పాతకోట్ల రాము,శ్రీరాముల శ్రీనివాస్,కాసాని శివ కృష్ణ, కిషోర్,పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## క్రీడలకు ప్రభుత్వం తగిన ప్రాధాన్యతనిస్తుంది

- ఏఎంసి చైర్ పర్సన్ తిరుపతమ్మ సుధీర్.

**తెలంగాణ చౌరస్తా,నడిగూడెం :**

క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వేపూరి తిరుపతమ్మ సుధీర్ అన్నారు. బుధవారం నడిగూడెం మండల కేంద్రంలో కీర్తిశేషులు ఎలుగూరి వెంకటేశ్వర్లు యువసేన ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీలను సర్పంచులు బూత్కూరి వెంకటరెడ్డి, దున్నా శ్రీనివాస్,అట్టూరి పుష్ప నాగేందర్ రెడ్డి,గోసుల రాజేష్, ఎస్సై అజయ్ కుమార్ లతో కలసి ప్రారంభించారు.అనంతరం ఆమె మాట్లాడుతూ క్రీడలను స్నేహపూర్వక వాతావరణంలో నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. క్రీడా పోటీ నిర్వహించిన వైవిఆర్ యువసేన సభ్యులను అభినందించారు.ఈ సందర్భంగా పోటీల ప్రారంభ కార్యక్రమానికి వచ్చిన అతిథులను,పీడీలను నిర్వాహకులు శాలువా, మెమంటాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లు ఎలుగూరి నాగరాజు,దోసపాటి రవి,వార్డు సభ్యులు దున్నా శ్రీకాంత్,గుండు మహీందర్ ప్రసాద్, కాసాని మాదవి గోపినాథ్,నాగవరపు సరస్వతి రాము,కాంగ్రెస్ పార్టీ నాయకులు గుండు శ్రీనివాస్,గుండు చిన్న శ్రీను,కాసాని శివ లింగం తదితరులు పాల్గొన్నారు



## మద్దూర్‌లో తుది ఓటర్ల జాబితా విడుదల

**మద్దూర్,తెలంగాణ చౌరస్తా:**

నారాయణపేట జిల్లాలోని నూతన మున్సిపాలిటీ మద్దూరులో సోమవారం రాష్ట్ర ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు 12,701 ఓటర్లను,16 వార్డులుగా విభజించి,ఎలాంటి పక్షపాతం లేకుండా తుది ఓటర్ల జాబితాను విడుదల చేయడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ సి.శ్రీకాంత్ తెలిపారు.ఈ ప్రకటనలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# మరాఠీకి? వెళ్లిపోతుందా

ముంబై బ్యూటీ రిద్ధీ కుమార్ టాలీవుడ్ జర్నీ గురించి చెప్పాల్సిన పనిలేదు. 'లవర్' ,' అనగనగా ఓ ప్రేమ కథ'లో హీరోయిన్ గా నటించింది. అటుపై 'రాధేశ్యామ్' లో కీలక పాత్రలో కనిపించింది. కానీ ఈ సినిమాలేవి కూడా రిద్ధీ కుమార్ కు కలిసి రాలేదు. కెరీర్ పరంగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్లు కనిపించింది. బాలీవుడ్ సహ మరాఠీలోనూ అదే పరిస్థితి. రెండు మూడు సినిమాలు చేసింది అనే పేరు తప్పా అక్కడా ఏనాడు బిజీ కాలేదు. సరిగ్గా ఇదే సమయంలో దర్శకుడు మారుతి రిద్ధీ కుమార్ లో ఫ్యూచర్ హీరోయిన్ ని చూసాడు. దీంతో మరో ఆలోచన లేకుండా పాన్ ఇండియా చిత్రం "ది రాజాసాబ్" లో ఛాన్స్ ఇచ్చాడు. కానీ ఇటీవలే రిలీజ్ అయిన ఈ సినిమా ఫలితం తెలిసిందే. రిద్ధీ కుమార్ పాత్రపై ఎలాంటి ఫీడ్ బ్యాక్ వచ్చిందో కూడా తెలిసిందే. కానీ ఈ సినిమాపై రిద్ధీ కుమార్ మాత్రం రిలీజ్ కు ముందు చాలా ఆశలు పెట్టుకుంది. విజయంతో టాలీవుడ్ లో బిజీ అవ్వాలనుకుంది. ఇంకా ఎన్నో కలలు కంది. నటిగా కొత్త ప్రయాణాన్ని ప్రారంభించాలి..తొలి సారి జరిగిన తప్పిదాలు రిపీట్ అవ్వకుండా కెరీర్ ముందుకు సాగించాలని ఓ ప్రణాళిక సిద్ధం చేసి పెట్టుకుంది. కానీ 'రాజాసాబ్' వైఫల్యం అన్నింటిని తారు మారు చేసేసింది. ఫ్లాప్ టాక్ తో ప్లానింగ్ అంతా బ్లాస్ట్ అయిపోయింది. ఈ సినిమాకు వచ్చిన టాక్ తో అందులో నటించిన మిగతా ఇద్దరు హీరోయిన్లకు కూడా అవకాశాలు రావడం కష్టమా? అన్న సందేహం రాకమానదు. ఇక రిద్ధీ కుమార్ సంగతి చూస్తే? అప్పటి టాలీవుడ్ నుంచి దుకాణం సర్దేసినట్లు తెలుస్తోంది. రూమ్ వెకెట్ చేసి ముంబైకి వెళ్లిపోయిందిట. ఇకపై నటిగా ప్రయాణం సొంత భాషలోనే చేయాలనుకుంటుందిట. ఈ క్రమంలో అమ్మడు మళ్లీ మరాఠీలో రీలాంచ్ అయ్యే ప్లాన్ లో ఉన్నట్లు తెలుస్తోంది. ఆరేళ్ల క్రితమే రిద్ధీ కుమార్ మరాఠీలో లాంచ్ అయింది. కానీ ఆ తర్వాత సినిమాలు కంటున్యూ చేయలేదు. ఇతర భాషల్లో అవకాశాలు రావడంతో మాతృభాషను లైట్ తీసుకుంది. కానీ గత ఏడాది మాత్రం ఓ సినిమా చేసింది. ఈలోగా రాజాసాబ్ బిజీలో పడి వచ్చిన అవకాశాలు కూడా వదులకుంది. ఈ నేపథ్యంలో పోయిన అవకాశాలు అందింపుచ్చుకునే ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. హైదరాబాద్ లో ఉన్నా? టైమ్ వేస్ట్ తప్ప అవకాశాలివ్వరని అమ్మడు కూడా ఓ స్ట్రాంగ్ డెసిషన్ కు వచ్చేసినట్లు తెలుస్తోంది.



Published and Managing Director by Gaddam Shyam on behalf Mithra Publications, Published at 1-9-1113/1/B, Street No. 11, Vidyanagar, Hyderabad, Telangana-500044.
Editor: GADDAM SHYAM, RNINO. TELTEL12241, tcnewsweb@gmail.com